SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 59 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 11 డిసెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



## మీ డబ్బు మీ హక్కు

**అన్‌క్లెయిమ్డ్ మనీ సొంతం చేసుకోండి**

**ప్రధాని మోడీ మరోమారు పిలుపు**

అన్ క్లెయిమ్డ్ ఆస్తు విషయంలో ఆర్‌బిఐ ఇటీవలే మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ప్రజల్లో కొంత చైతన్యం వచ్చింది. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా తనవంతుగా ప్రచారం మొదలు పెట్టారు. ఇది ప్రజలకు మేలు చేస్తుందన్న భావనలో ఆయన ప్రకటన చేశారు. 4



# ఉస్మానియా వర్సిటీకి మహార్దశ

**వెయ్యికోట్లు విడుదలకు సీఎం అంగీకారం**

**వెంటనే విడుదలకు విద్యాశాఖ ఉత్తర్వులు**

**బీఆర్ఎస్ అవినీతికి కాళేశ్వరం పెద్ద ఉదాహరణ**

## ఉద్యమంలో ఉస్మానియాదే కీలకం

- దైర్యంతో కాదు.. గుండెనిండా ప్రేమతో ఇక్కడికి వచ్చా
- చదువు విలువ తెలిసినోడిని
- సీఎం రేవంత్ భావోద్వేగ ప్రసంగం



**హైదరాబాద్, డిసెంబర్ 10:** ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్ర మాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చానని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమాలకు ఉస్మానియానే కేంద్రమని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఇది వేదికగా నిలిచిందన్నా రు. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణ లో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామా న్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు.

మిగతా 2 లో

## నేడే తొలి విడత

- పంచాయితీ పోరుకు సర్వసిద్ధం
- 4,236 జీపీలు, 37,440 వార్డులు
- 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు
- ఓటేయనున్న 56,19,430 మంది ఓటర్లు
- ఉదయం 7 నుంచి 1 గంటవరకు పోలింగ్
- మధ్యాహ్నమే ఓట్ల లెక్కింపు.. ఫలితం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

2





## కోటి కోట్లు సాధ్యమా?

మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారు?

ఇప్పటికీ రైతులకు రుణమాఫీ కాలేదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

.. వివరాలు 3లో


## ఫ్రస్టేషన్‌లో మాధవరం

ఆరోపణలకు సమాధానమిస్తా..

సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత

.. వివరాలు 3లో

## ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తుపై సుప్రీం అసంతృప్తి!



.. వివరాలు 2లో



హైదరాబాద్‌లో ఉన్న అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మీరు యువకులు, శక్తివంతులు.. సాధార ణంగా మీరు మీ కలల ను సాకారం చేసుకోవా లనుకుంటారని పేర్కొ న్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రూ.వేల కోట్లు కేటా యిస్తున్నామన్నారు.

## అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటి

**సమిష్టి కృషికి ఇదో పెద్ద నిదర్శనం**

**స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు వేల కోట్లు**

**గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్** 2



02

## ఇంటికి పిలిచి, బ్యాట్‌తో కొట్టి..

**సంగారెడ్డి జిల్లాలో దారుణం**

**కూతురు ప్రేమపై విషం చిమ్మిన తల్లిదండ్రులు యువకుడిని పిలిపించి దారుణంగా హత్య**

## మత్తు ఇంజెక్షన్ల కలకలం

**అధిక డోస్‌తో ఆటోడ్రైవర్ల మృతి డాక్టర్ జైపాల్ రెడ్డి, మరో వైద్యుడు అరెస్ట్** 03

## ఆర్టీసీకి 65 ఎలక్ట్రిక్ బస్సులు

- కాలుష్య నివారణ లక్ష్యంగా కృషి
- మంత్రి పొన్నం ప్రభాకర్



## గుడివాడలో ప్రత్యక్షమైన కొడాలి నాని

**18 నెలల విరామం తరవాత ప్రత్యక్ష రాజకీయాల్లోకి**

**కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే**



**విజయవాడ :** సుదీర్ఘ విరామం తర్వాత క్రియాశిల గుడివాడ రాజకీయాల్లో మాజీ మంత్రి కొడాలి నాని ప్రత్యక్షమయ్యారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో

మిగతా 5 లో



## ప్రజలు మెచ్చేలా పరిపాలన

**ప్రజల కోసం అవసరమైతే బిజినెస్ రూల్స్ మార్చండి**

మాట ఇచ్చాం.. విద్యుత్ ఛార్జీలు పెంచం


వినూత్న ఆలోచనలతో ప్రజలకు సేవలు..

మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఓడీల సమావేశంలో ప్రారంభ ఉపన్యాసంలో సీఎం చంద్రబాబు

**అమరావతి:** ప్రజలు మెచ్చే పాలన అందించే దిశగా ప్రతి విభాగం, ప్రతి అధికారి పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈమేరకు అవసరమైతే ప్రభుత్వ బిజినెస్ రూల్స్ సవరించుకోవాలని సూచించారు. సచివాలయంలోని ఐదవ బ్లాక్‌లో బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఓడీల కాన్ఫరెన్సు జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులు హాజరయ్యారు. వృద్ధిరేటు

మిగతా 5 లో





# ఇంటికి పిలిచి, బ్యాట్‌తో కొట్టి..

## సంగారెడ్డి జిల్లా బీరంగూడలో దారుణం

## కూతురు ప్రేమపై విషం చిమ్మిన తల్లిదండ్రులు

## యువకుడిని పిలిపించి దారుణంగా హత్య

**సంగారెడ్డి, డిసెంబర్ 10:** సంగారెడ్డి జిల్లా బీరంగూడలో దారుణం జరిగింది. కూతురును ప్రేమించాడని తెలిసి.. పెళ్లి గురించి మాట్లాడదామని అతడిని ఇంటికి పిలిపించి అమ్మాయి తల్లిదండ్రులు అతనిడిని దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇంజనీరింగ్ స్టూడెంట్ జ్యోతి శ్రావణ్ సాయిని హత్య చేసిన ఘటన అమీన్‌పూర్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో వెలుగులోకి వచ్చింది. జ్యోతి శ్రావణ్ సాయి(20), బీరంగూడ ఇసుకబావికి చెందిన శ్రీజ (19) గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉండడంతో అమ్మాయి తల్లిదండ్రులు తమ కూతురిని ప్రేమించొద్దని పలుమార్లు సాయిని హెచ్చరించారు. అయినప్పటికీ శ్రావణ్ సాయి, శ్రీజ తమ ప్రేమను కొనసాగించారు. ఈ విషయం శ్రీజ తల్లిదండ్రులకు తెలిసింది. సాయిపై పగ పెంచుకున్న శ్రీజ కుటుంబం ఇద్దరికీ మ్యారేజీ చేస్తామని, మాట్లాడుకుందామని అతనిని ఇంటికి పిలిపించారు. ఇంటికి పిలిచి ఒక్కసారిగా సాయిపై దాడి చేశారు. విచక్షణా రహితంగా అతనిని కొట్టడంతో శ్రావణ్ సాయికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఇంట్లోకి లాక్కెళ్లి మరీ దాడి చేశారు. దెబ్బలకు తాళలేక విలవిలలాడిపోయిన శ్రావణ్ సాయి ప్రాణాలు కోల్పోయాడు. జ్యోతి శ్రావణ్ సాయి మైసమ్మ గూడలోబి సెయింట్ పీటర్ కాలేజీలో బీటెక్ సీఎస్‌ఈ సెకండియర్ చదువుతున్నాడు. కుత్బుల్లాపూర్‌లో రూం తీసుకుని జ్యోతి శ్రావణ్ సాయి ఉంటున్నాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్ చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమీన్ పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వీరిద్దరూ పదో తరగతి వరకూ కలిసి చదువుకోవడంతో సాన్నిహిత్యం ఏర్పడి.. ప్రేమకు దారితీసినట్టు తెలుస్తోంది. ఈ విషయం తెలిసి ఇరువురినీ పలుమార్లు హెచ్చరించారు శ్రీజ తల్లిదండ్రులు. అయినా వినిపించుకోకపోవడంతో ఆగ్రహించిన యువతి తల్లిదండ్రులు.. హతమార్చారు. ఈ ఘటనపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు నేటికి వాయిదా



**న్యూఢిల్లీ, డిసెంబర్ 10:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ సుప్రీంకోర్టులో గురువారానికి వాయిదా పడింది. ఈ సందర్భంగా, కేసు దర్యాప్తునకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది ధర్మాసనానికి ఒక ముఖ్య విషయాన్ని తెలియజేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు దర్యాప్తు సంస్థతో ఏమాత్రం సహకరించడం లేదని, దర్యాప్తు సంస్థతో ఆయన ఆటలాడుతున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, కీలకమైన రుజువులను నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగా ప్రభాకర్ రావు తన ఐక్లౌడ్‌లోని డేటాను డిలీట్ చేశారని కూడా న్యాయస్థానానికి వెల్లడించారు. అయితే, ప్రభాకర్ రావు తరపు సీనియర్ న్యాయవాది ఆ రోజు అందుబాటులో లేకపోవడంతో, ధర్మాసనం ఈ కేసు తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. ఈ కీలక కేసులో విచారణ రేపు కూడా కొనసాగనుంది.

# తొలివిడతకు భారీ బందోబస్తు

## డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, డిసెంబర్ 10:** తెలంగాణలో గురువారం జరిగే మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లాల పోలీస్ యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లుచేసిందన్నారు. మొత్తం 3,800కు పైగా పంచాయతీల్లో ఎన్నికలు జరగనుండగా.. 3వేల పంచాయతీల్లో పోలింగ్‌ను నేరుగా వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్టు చెప్పారు. బందోబస్తులో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, ఇతర స్పెషల్ పోలీస్ సిబ్బంది కూడా పాల్గొంటారని తెలిపారు. సాధారణ పోలింగ్ కేంద్రాలతో పాటు సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ పూర్తయ్యే వరకు సిబ్బంది పూర్తి స్థాయి విధుల్లో ఉంటారన్నారు. ఇప్పటి వరకు రూ. 8.20 కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువుల స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ తెలిపారు. 54 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులు 24 గంటలూ పనిచేస్తున్నాయ న్నారు. ప్రజలంతా తనిఖీలకు సహకరించి.. ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు.

# ఆదిలాబాద్ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**ఆదిలాబాద్, డిసెంబర్ 10:** ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. జైనథ్ మండలం తరోడ సమీపంలో బుధవారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. మృతులను ఆదిలాబాద్‌లోని జైజవాన్ నగర్, లక్ష్మీనగర్ వాసులుగా గుర్తించారు. మహారాష్ట్రకు మేస్త్రీ పనికి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతదేహాలను జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు.

# అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటి

- గూగుల్‌ది.. నేడు ప్రపంచస్థాయిలో అగ్రస్థానం
- సమిష్టి కృషికి ఇదో పెద్ద నిదర్శనం
- స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు వేల కోట్లు
- గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్




**హైదరాబాద్, డిసెంబర్ 10:** హైదరాబాద్‌లో ఉన్న అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మీరు యువకులు, శక్తివంతులు.. సాధారణంగా మీరు మీ కలలను సాకారం చేసుకోవాలనుకుంటారని పేర్కొన్నారు. బుధవారం టీ హబ్‌లో గూగుల్ స్టార్టప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రూ.వేల కోట్లు కేటాయిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. మూడు దశాబ్దాల క్రితం స్టార్టప్‌గా ప్రస్థానం ప్రారంభించిన గూగుల్.. నేడు ప్రపంచస్థాయిలో నిలిచిందని చెప్పారు. ఆ సంస్థను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీహబ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. హైదరాబాద్‌ను స్టార్టప్‌లకు కేంద్రంగా చేయనున్నట్లు రేవంత్ తెలిపారు. స్టార్టప్‌లు యూనికార్న్ స్థాయికి ఎదిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని కృషి చేయాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించారు. ఉన్నత ఆశయాలతో 1998లో ఇద్దరు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మిత్రులు ఇద్దరు కలిసి కాలిఫోర్నియాలో ఒక గ్యారేజీలో ఓ స్టార్టప్‌ను ప్రారంభించారని తెలిపారు. అదే నేటి ప్రఖ్యాత గూగుల్ కంపెనీగా అవతరించిందని గుర్తుచేశారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధిని ఆకాంక్షించి ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచయం చేయాలని గత రెండు రోజులు, మనం తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించామని వివరించారు. జాతీయ అంతర్జాతీయ కార్పొరేట్ల సమక్షంలో తెలంగాణ భవిష్యత్ కోసం మన విజన్‌ను ఆవిష్కరించామని పేర్కొన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గత 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన అనేక స్టార్టప్స్ నేడు బిలియన్ల డాలర్ల కంపెనీలుగా ఎదిగాయని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి.'గూగుల్, ఆపిల్, అమెజాన్, టెస్లా, ఫేస్‌బుక్ ఇలాంటి గొప్ప ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. గత 25 సంవత్సరాల్లో సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్‌లో చాలా స్టార్టప్స్ పెద్ద కంపెనీలుగా ఎదిగాయి. తెలంగాణ రైజింగ్ విజన్ స్టార్టప్స్ కోసం మీ ప్రణాళికలు ఏంటని అడిగితే... స్టార్టప్స్‌ని ఫుట్‌బాల్ ఆటతో పోలుస్తాం. నేను ఆ ఆట ఆడతాను. ఫుట్‌బాల్‌లో సమష్టి కృషి అవసరం. పట్టుదలతో సాధన చేయాలి. ఇది టీమ్ వర్క్. కానీ చివరకు గెలుపు చాలా ముఖ్యం. స్టార్టప్స్ కూడా అదే విధంగా ఉండాలి. ఈ రోజు నుంచి హైదరాబాద్ ప్రోడక్ట్ బేస్డ్ స్టార్టప్స్, ఇన్నోవేటివ్ స్టార్టప్స్, ఐపీ ఇంటెన్సీవ్ స్టార్టప్స్ వీటి పైనే దృష్టి పెట్టాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు.'హైదరాబాద్ కేవలం స్టార్టప్స్ హబ్‌గా ఎదగడమే కాదు. ఆ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నాం. కనీసం 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలుగా ఎదగాలి. 2034 నాటికి వాటిల్లో కనీసం 10 సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి. అందుకోసం రాష్ట్రంలో ఒక మంచి ఎకోసిస్టమ్‌ను సృష్టించాలనుకుంటున్నాం. తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ మీకు అవసరమైన సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. స్టార్టప్‌ల కోసం మా ప్రభుత్వం రూ. 1000 కోట్లతో స్టార్టప్స్ ఫండ్ ఏర్పాటు చేస్తుంది. ఆ ఫండ్స్‌ను వినియోగించుకోండి. తద్వారా స్టార్టప్‌లు గూగుల్ స్థాయిలో లేదా 1 బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగాలని కోరుకుంటున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇప్పటికే ఎన్నో జీసీసీలు నగరంలో పెట్టుబడులు పెడుతున్నాయని.. స్టార్టప్‌లు సైతం ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకువెళ్లాలని సూచించారు.

# ఉస్మానియా వర్సిటీకి మహర్దశ



మొదటి పేజీ తరువాయి

గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థులు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా.. లేదా.. అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నానని అన్నారు. బుధవారం ఉస్మానియా వర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూకు రూ. 1000 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అంకితం చేశారు. అలాగే, ఓయూ అభివృద్ధికి రూ. 45 లక్షల చెక్కు పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ భవనం దగ్గర 'సర్వం సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా ఉస్మానియా యూనివర్సిటీ వినిపించిందని తెలిపారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించడానికి ఓయూకు వచ్చానని వివరించారు. గతంలో ముఖ్యమంత్రులను అడ్డుకున్న చరిత్ర ఉందని ప్రస్తావించారు. మీరు ఎందుకు ఓయూకు వెళ్లే ధైర్యం చేస్తున్నారని కొంతమంది తనతో అన్నారని గుర్తుచేశారు. మీరిచ్చే సూచనలు, మేధావులు ఇచ్చే సలహాలతో ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం అండగా ఉండాలనే ఓ ఆలోచనతో ఇక్కడకు వచ్చానని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ధైర్యంతో కాదని.. విద్యార్థుల గుండెల నిండా ఉన్న అభిమానంతో ఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చానని వ్యాఖ్యానించారు. తమ ప్రసంగాలు చదువుకొని కాదని.. తన మనసులో ఉన్నది చెప్పాలని ఇక్కడకు వచ్చానని చెప్పుకొచ్చారు. పురాతన యూనివర్సిటీలో ఉస్మానియా ఒకటని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి గొప్ప చరిత్ర ఉందని అభివర్ణించారు. ఇక్కడకు రావాలంటే ధైర్యం కాదని.. అభిమానం కావాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చదువు లేకున్నా ఆధిపత్యాన్ని సహించరని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ ఇచ్చింది. బడికి వెళ్లని ఓ పేదింటి బిడ్డ అందెశ్రీ.. జయజయహే తెలంగాణ నినాదాన్ని అందించారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా ఈ యూనివర్సిటీ విద్యార్థులు కదం తొక్కారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు.. కేవలం స్వేచ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే అడిగారు. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం స్వేచ్ఛను ఇస్తుంది. ప్రపంచానికే మీరు దిక్సూచిగా మారాలి. ఎవరి గురించీ రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. కొందరు రెండేళ్లుగా మాట్లాడుతున్నారు. నేను గుంటూరులో చదువుకోలేదు.. గూడుపుఠాణీలు చేయలేను. గుంటూరులో చదువుకున్న వాళ్లు బెంజ్ కారులో వెళ్లి పేదరికం గురించి తెలుసుకుంటారు. గుంటూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలని అనుకుంటున్నారు? నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగానే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలుచున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్యను పరిష్కరించాం. విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడదనే యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువుకునేలా చర్యలు చేపట్టాం. డబ్బు ఉన్నవాళ్లు ఎక్కడికి వెళ్లి అయినా చదువుకోగలరు. పేదింటి విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ నాణ్యమైన విద్యను అందించాలి. మంజూరు చేసిన రాష్ట్రానికి ఓయూ గుండెకాయ లాంటిది. సమస్యల మీద కొట్లాడతానంటే నేను వద్దు అనను. రాజకీయ పార్టీల మోచేతినీళ్లు తాగాలని.. వాళ్ల జెండాలు మోయాలని అనుకోవద్దు. మీ స్వతంత్రతను నిలబెట్టుకోండని రేవంత్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వెయ్యికోట్ల నిధుల విడుదల జీవోను విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# నేడే తొలివిడత

- పంచాయితీ పోరుకు సర్వసిద్ధం
- తొలి విడతలో 189 మండలాలు
- 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు
- రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు
- తొలి విడతలో ఓటేయనున్న 56,19,430 మంది ఓటర్లు
- గ్రామాల్లో భారీగా బందోబస్తు
- ఉదయం 7 నుంచి 1 గంటవరకు పోలింగ్
- మధ్యాహ్నమే ఓట్ల లెక్కింపు.. ఫలితం
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



**హైదరాబాద్, డిసెంబర్ 10:** తెలంగాణ రాష్ట్రంలో తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. ఇప్పటికే జోరుగా ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు నేటి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా పంచాయితీ ఎన్నికల్లో పోటీ పెరిగింది. తెలంగాణలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నాయి. హైదరాబాద్‌లో ఎస్‌ఈసీ రాణి కుముదిని విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి దశ పల్లె పోరుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7.00 గంటల నుంచి ఈ పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ తొలి దశలో 56,19,430 మంది ఓటర్లు.. తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. గురువారం జరగనున్న తొలి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగేలా విస్తృత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తొలి విడతలో మొత్తం 189 మండలాలు, 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, తొలి విడతలో 56,19,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. వీరిలో 27,41,070 మంది పురుషులు, 28,78,159 మంది మహిళలు, 201 మంది ఇతరులు ఉన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ. 8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్‌ఈసీ తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం సుమారు లక్ష మంది ఎన్నికల సిబ్బందిని నియమించామని కమిషనర్ తెలిపారు. ఇందులో 3,591 మంది రిటర్నింగ్ అధికారులు, 93,905 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారు. అలాగే ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు 2,489 మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పారదర్శకత కోసం 3,461 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 45,086 బ్యాలెట్ బాక్సులు వినియోగించనున్నారు. ఓటర్ సౌలభ్యం దృష్ట్యా 99 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందని కమిషనర్ వెల్లడించారు. ఎన్నికల ప్రచారం కూడా మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, భయభ్రాంతులు లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య బలోపేతంలో ఓటు కీలకమని పేర్కొంటూ, గ్రామాల భవిష్యత్తు నిర్ణయంలో ఓటు శక్తిని గుర్తించాలని ఆమె అన్నారు. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల విధుల్లో లక్ష మందికి పైగా సిబ్బంది పాల్గొనున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు 18 రకాల ఐడి కార్డులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏ రకమైన ఐడి కార్డును పోలింగ్ బూత్ అధికారులకు చూపించిన ఓటు వేయవచ్చునన్నారు. ఇక మంగవారం నుంచి ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వైన్ షాపులన్నీ మూసి వేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు మేజిస్ట్రియల్ పవర్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్‌ఈసీ వివరించారు. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్నారు.

# ఆర్టీసీకి 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు



- కాలుష్య నివారణ లక్ష్యంగా కృషి
- బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, డిసెంబర్ 10:** తెలంగాణ రాష్ట్రంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను గణనీయంగా పెంచుతూ, ఆర్టీసీని కాలుష్య రహిత ప్రజా రవాణా వ్యవస్థగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీలో 810 ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెడుతున్నాయి. ఇందులో జంట నగరాల పరిధిలో 300కు పైగా బస్సులు తిరుగుతున్నాయి. జనవరి చివరి నాటికి మరో 175 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. అత్యాధునిక 'పీఎం ఈ-డ్రైవ్' పథకం కింద అతి త్వరలో ఏకంగా 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రక్రియ దశలవారీగా ఒకటి లేదా రెండు సంవత్సరాలలో పూర్తవుతుందని మంత్రి తెలిపారు. ఆర్టీసీ రవాణా వ్యవస్థను ఈవీ బస్సుల ద్వారా ముందుకు తీసుకువెళ్లి, హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలను విస్తరించడంలో భాగంగా త్వరలో 373 కొత్త ప్రాంతాలకు బస్ కనెక్టివిటీని అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇంటర్ సిటీ ట్రాన్స్‌పోర్టేషన్ కింద వరంగల్, ఖమ్మం, నల్గొండ వంటి చుట్టుపక్కల జిల్లాల నుండి హైదరాబాద్‌కు ఈవీ బస్సులను ప్రారంభం చేసినట్లు ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బస్సుల విస్తరణ జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, మహాలక్ష్మి పథకం అమలు ద్వారా ఆర్టీసీ వ్యవస్థ లాభాల బాట పట్టిందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ కార్మికులకు భరోసా ఇస్తూ, వారి సమస్యలన్నీ అతి త్వరలో పరిష్కారమవు తాయని హామీ ఇచ్చారు. ప్రజా పాలన ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభించినట్లు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్, శ్రామిక్, ఇతర సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారని.. వారందరికీ అభినందనలు చెప్పారు. ఇప్పటికీ 251 కోట్ల మంది మహిళలు.. రూ.8,500 కోట్ల విలువైన ప్రయాణాలు చేశారన్నారు. హాస్పిటల్స్, దేవాలయాలు, ఉద్యోగులు, బంధువుల ఇంటికి, స్కూళ్లకు రాకపోకలు సాగించారన్నారు. దేవాదాయ శాఖ ఆదాయం మహాలక్ష్మి పథకం ద్వారా పెరిగిందన్నారు. రెండేళ్లలో ప్రస్తుతమున్న 40శాతం బస్సులను కొనుగోలు చేయడం జరిగిందని.. ఆర్టీసీలో కొత్త రక్తం వస్తుందన్నారు. కొత్తగా డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్స్ వస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానుల చేసిందన్నారు. ఢిల్లీ లో నివాస యోగ్యం లేకుండా కాలుష్యం ఉన్న పరిస్థితి ఉందని.. ఇక్కడ అలాంటి పరిస్థితి రాకుండా రవాణా శాఖ ఈవీ పాలసీ, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల భద్రత దృష్టిలో పెట్టుకుందన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఈవీ బస్సులు సమ్మక్క సారలమ్మ జాతర, శ్రీశైలం, యాదాద్రికి రాకపోకలు సాగిస్తాయన్నారు. ప్రత్యేక బస్సులు బస్సులు, నూతన బస్ డిపోల ఏర్పాటు, బస్ స్టేషన్లను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. 1932లో ప్రారంభించిన ఆల్బియన్ బస్సు, మధ్యలో వచ్చిన ఎర్రబస్సు, ప్రస్తుతం నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సు అక్కడ ఎగ్జిబిషన్ పెట్టినట్లు చెప్పారు. ఎయిర్‌పోర్ట్‌లో ఇబ్బందులు వచ్చినా దగ్గరలో ఉన్న ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపినట్లు చెప్పారు. ప్రజారవాణాలో మరిన్ని నిర్ణయాలు తీసుకుంటామని.. ఈవీ బస్సుల ప్రారంభోత్సవంతో నగరంలో మరింత మెరుగ్గా బస్సులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఈవీ పాలసీని తీసుకువచ్చామని.. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈవీ, సీఎన్‌జీ, ఎల్పీజీ ఆటోలకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. బస్సుల ప్రారంభోత్సవం సందర్భంగా నగర ప్రజలకు మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు.



## ఫ్రస్టేషన్‌లో ఎమ్మెల్యే మాధవరం

### అన్ని ఆరోపణలకు ఆధారాలతో సమాధానమిస్తా..

### మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, డిసెంబరు 10:** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయటం ఆయన ఫస్ట్రేషన్‌ను బయట పెడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆయన చేసిన అన్ని ఆరోపణలకు ఆధారాలతో సహా వివరణ ఇస్తానన్నారు. కూకట్‌పల్లిలో 15 ఏళ్లుగా ఉన్న సమస్యలనే తాను చెప్పానని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడిన మాటాలకు ఫీలయ్యేది లేదని... ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. జాగృతి జనం బాటలో భాగంగా ఐదు రోజుల పాటు హైదరాబాద్ జిల్లాలో పర్యటిస్తామని తెలిపారు. నేడు కంటోన్మెంట్‌లోని బోయినపల్లి గవర్నమెంట్ స్కూల్‌ను సందర్శించినట్లు చెప్పారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా ఈ స్కూల్‌ను బాగు చేశారని.. కానీ కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు లేవన్నారు. వాటిని తాము ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ స్కూళ్లోనే అంగన్ వాడీని కూడా కలిపారని... కానీ అంగన్‌వాడీలో హెల్పర్లు లేరన్నారు. జనం బాటలో భాగంగా విద్య, వైద్యం మీద ఫోకస్ పెట్టామని వెల్లడించారు. స్కూల్స్, హాస్పిటల్స్‌లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నామన్నారు. ఇండ్లు, ఇళ్ల పట్టాలను లేని వారి సమస్యలు కూడా తెలుసుకుంటున్నామన్నారు. తమ వరకు చేయగలిగేది ఒక సంస్థగా చేస్తామని స్పష్టం చేశారు. టాప్ టెన్ విద్యార్థులకు జాగృతి తరఫున స్కాలర్ షిప్‌లు ఇస్తామని ప్రకటించారు. ఏ జిల్లాకు వెళ్లినా ప్రజల నుంచి ఆదరణ, సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటోందన్నారు. ప్రజల సమస్యలను వీలైనంతగా పరిష్కరిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వంలో తనను నిజామాబాద్‌కే పరిమితం చేశారని.. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఏం జరుగుతుందో చూడలేదన్నారు. తెలంగాణ వచ్చాక ఏం జరిగింది... ఏం జరగలేదన్నది జనం బాట కార్యక్రమం ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. తాము చేయగలిగేవి చేస్తామని... మిగిలిన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. మంచిని మంచి, చెడును చెడు అనే అంటామని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ప్రతిపక్షం పట్టించుకోవటం లేదని... పాలక పక్షం అసలే పట్టించుకుంట లేదని.. అందుకే జాగృతి జనం గళమై పనిచేస్తోందని కవిత పేర్కొన్నారు.

# కోటి కోట్లు సాధ్యమా?

- మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారు?
- ఇప్పటికీ పూర్తిస్థాయి రుణమాఫీ కాలేదు
- 7వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు
- పెంచిస్తామని చెప్పిన పింఛన్లను దిక్కేలేదు
- కాంగ్రెస్ పాలనలో ప్రజలు మోసపోయారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా 5వేల మంది ఆటో కార్మికులకు ప్రమాద బీమా బాండ్ల అందజేత



**సిరిసిల్ల:** కోటి మంది మహిళల్ని కోటీశ్వరులను చేయాలంటే ఎన్ని కోట్లు కావాలి.. కోటీ కోట్లు సాధ్యమవుతుందా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్లలో బుధవారం గతంలో ఇచ్చిన మాట ప్రకారం జిల్లావ్యాప్తంగా 5వేల మంది ఆటో కార్మికులకు రూ.5లక్షల ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో చెప్పిన విధంగా ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.1000 చొప్పున రెండేళ్లకు రూ.24వేల బాకీ పడిందన్నారు. మహిళలందరికీ సీఎం రేవంత్ రెడ్డి రూ.1560 కోట్లు బాకీ పడ్డాడన్నారు. ఆటో కార్మికులతో తమ అనుబంధం ఈనాటిది కాదని, ఉద్యమ సమయం నుంచి ఇప్పటివరకు వారి మద్దతు మరువలేమన్నారు. మానిఫెస్టోలో పెట్టకుండానే కేసీఆర్ ప్రమాద బీమా అమలు చేయలు చేశారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో 13 లక్షలకు పైగా అన్ని రంగాల కార్మికులకు ప్రమాద బీమా చేసినట్లు చెప్పారు. అలాగే ప్రపంచంలో రైతులకు రైతు బీమాతో ధీమా ఇచ్చిన నాయకుడు కేసీఆర్ అని, జిల్లాలో నేతన్నలు, గౌడన్నలకు బీమా పెట్టారని.. బీఆర్ఎస్ మూడోసారి గెలిస్తే రాష్ట్రంలో అందరికీ కేసీఆర్ ధీమా పథం వచ్చేదని చెప్పారు. 4.30 లక్షల మంది బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. ఈ రెండేళ్లలో మార్పు అర్థమైందని, ప్రజలందరూ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారన్నారు.

### ఓనర్ టు డ్రైవర్

జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా తాను ఆటోలో ప్రయాణించినట్లు చెప్పారు. 'రెండు ఆటోల ఓనర్ మస్రత్ అలీ ఆటోలో గతంలో రాహుల్ గాంధీ ప్రయాణించాడు. ఇప్పుడు రెండు ఆటోలు అమ్ముకున్న కిరాయి ఆటోలు నడుపుకుంటున్నాడు. డ్రైవర్ టు ఓనర్ అనాడు.. ఈనాడు ఓనర్ టు డ్రైవర్' అయ్యాడని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు మోసపోయారని, బోగస్ హామీలిచ్చి గద్దెనెక్కారని విమర్శించారు. రుణమాఫీకి రూ.50 వేలకోట్లు అవసరమని, ఇప్పటికీ రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ కాలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారని, రెండేళ్లలో 7 వేల ఉద్యోగాలు ఇవ్వలేదని మండిపడ్డారు. పెంచి ఇస్తామని చెప్పిన పెన్షన్లు ఎగ్గొట్టారని ఎద్దేవా చేశారు.

### ఆటో సంక్షేమ బోర్డు పెట్టాల్సిందే

రాష్ట్రంలో ఆటో కార్మికుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని కేటీఆర్ అన్నారు. 13.30 లక్షల మంది ఆటో కార్మికులకు బీమా కార్యక్రమం చేస్తే దాన్ని కూడా రేవంత్ రెడ్డి ఊడగొట్టిందన్నారు. పాసింజర్ ఆటోలే కాకుండా ట్రాక్టర్, ట్రాలీ ఆటో కార్మికులకు సంఖ్య కూడా సంక్రాంతి వరకు తీసుకుని వారికి కూడా బీమా సౌకర్యం కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఆటో సంక్షేమ బోర్డు పెట్టకపోతే ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో కోపరేటివ్ సొసైటీగా ఏర్పడితే మేలు జరుగుతుందన్నారు. మరోవైపు మహిళలకు ఫ్రీ బస్సు అంటూనే ప్రభుత్వం రేట్లు పెంచిందని.. ఇలా అయితే ఎలా ఫ్రీ బస్ పథకం అవుతుందో చెప్పాలని ప్రశ్నించారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ దోపిడీ ప్లాన్

### రైజింగ్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ • మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, డిసెంబర్ 10:** కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన.. ఇది గ్లోబల్ సమ్మిట్ కాదని.. భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ సమ్మిట్ అంటూ వ్యాఖ్యలు చేశారు. అందాల పోటీల్లాగే, ఏఐ సమ్మిట్ లాగే.. గ్లోబల్ సమ్మిట్ కూడా అట్టర్ ఫ్లాప్ షో అయ్యిందంటూ కామెంట్స్ చేశారు. పెట్టుబడుల కట్టు కథలు చెప్పి, కోట్లు ఖర్చు చేసి గ్లోబల్ సమ్మిట్‌ను అట్టర్ ఫ్లాప్ చేశారంటూ ఫైర్ అయ్యారు. గ్లోబల్ సమ్మిట్ పేరిట రియల్ ఎస్టేట్ స్కాంకు తెరతీశారంటూ మాజీ మంత్రి సంచలన ట్వీట్ చేశారు. 'విజన్ డాక్యుమెంట్‌లో విజన్ లేదు, దాన్ని చేరుకునే మిషన్ లేదు, విజన్ డాక్యుమెంట్ కాదు.. 'విజన్ లెస్' డాక్యుమెంట్. క్యూర్, ప్యూర్, రేర్ అంటూ అంటున్న రేవంత్ రెడ్డి.. తెలంగాణను కొల్లగొడుతున్న చోర్. గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూల వెనుక చీకటి ఒప్పందాలు, అంకెల గారడీ తప్ప ప్రజలకు పనికొచ్చే పనులు ఏవీ లేవు. రెండేళ్లుగా కోట్లు ఖర్చు చేసి తిరిగిన దేశాలు, నిర్వహించిన సమ్మిట్స్ ద్వారా మొత్తం ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి? అందులో ఎన్ని కంపెనీలు గ్రౌండ్ అయ్యాయి? ఎంత మంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయి.. దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి గ్లోబల్ సమ్మిట్ వేదికగా టోనీ ÷-లబెయిర్, సుబ్బారావు ఇచ్చిన కితాబు రేవంత్ రెడ్డికి చెంపపెట్టు. రేవంత్ రెడ్డి నిర్వహించింది గ్లోబల్ సమ్మిట్ లాగా లేదు, భూములు అమ్మకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ సమ్మిట్' అంటూ హరీష్ రావు ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

# వర్సిటీల్లో 'ఇంక్యూబేషన్' సెంటర్లు

### 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, డిసెంబర్ 10 :** కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో 'ఇంక్యూబేషన్' సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా మార్చాలనే లక్ష్య సాధనలో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, లైఫ్ సైన్సెస్ హబ్ 'వన్ హబ్'కు ధీటుగా ఈ కేంద్రాలను తీర్చి దిద్దుతామన్నారు. బుధవారం టీ హబ్ లో 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్'ను సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... మేం స్టార్టప్ లను కేవలం చిన్న కంపెనీలుగా మాత్రమే చూడటం లేదని, సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు వినూత్న పరిష్కారాలు అందిస్తూ... కొత్త ఉద్యోగాలను సృష్టించే 'ఎకనామిక్ ఇంజిన్స్'గా చూస్తున్నామన్నారు. 2024 లో ఇక్కడి స్టార్టప్‌లు 571 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయన్నారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 160 శాతం అధికమని వివరించారు. ముఖ్యంగా హెల్త్ టెక్ రంగంలో 2,139 శాతం వృద్ధి నమోదయ్యిందన్నారు. మహిళా నేతృత్వంలోని స్టార్టప్‌లలో హైదరాబాద్ దేశంలోనే ఆరో స్థానంలో ఉందన్నారు. 531 వుమెన్ లెడ్ స్టార్టప్ లు 417 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయన్నారు. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదని, తమ ప్రభుత్వ పనితీరుకు, ప్రగతిశీల విధానాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. తమ ప్రభుత్వం టెక్నాలజీని కేవలం టూల్ గా మాత్రమే చూడటం లేదని, ఒక సమానత్వ సాధనంగా చూస్తోందన్నారు. టెక్నాలజీ ఫలాలను రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ అందేలా చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. స్టార్టప్ లు, కొత్త ఆలోచనలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు రూ.వేయి కోట్లతో 'ఫండ్ ఆఫ్ ఫండ్'ను అందుబాటులోకి తెస్తామన్నారు. కొత్త ఆలోచనలకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని యువ ఆవిష్కర్తలకు హామీ ఇచ్చారు.

## మహాలక్ష్మీ పథకానికి రెండేండ్లు

### ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి శుభాకాంక్షలు

**హైదరాబాద్, డిసెంబర్ 10:** మహా లక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభమై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బస్ భవన్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 97 డిపోల్లో ఉన్న ఆర్టీసీ అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్ విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహాలక్ష్మీ పథకం విజయవంతానికి నిరంతరం శ్రమిస్తున్న డ్రైవర్లు , కండక్టర్లు , శ్రామిక్ ఇతర సిబ్బందిని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రవాణా శాఖ మంత్రి గా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎండీ, ఈడిలు సత్కరించారు. ఆర్టీసీని మరింత విస్తృత పర్చాలని క్షేత్ర స్థాయిలో రాజధాని నుండి గ్రామాల వరకు ఆర్టీసీ కొత్త రూట్లను అన్వేషించి ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడిపించేలా కార్యాచరణ తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ఇప్పటికే హైదరాబాద్ నగరంలో గత 3 నెలలుగా సర్వే చేసి 373 కొత్త రూట్లలో ఈరోజు నుండి ప్రజా రవాణా అయిన ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. 2047 విజన్ లో ముఖ్యమంత్రి గారి ఆలోచనలకు అనుగుణంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లో రవాణా శాఖ కీలక పాత్ర పోషించాలని తెలిపారు. దేశంలో అత్యున్నత సంస్థగా ఆర్టీసీ ఎదగాలని ఆశించారు. సమీక్షా సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఈడీలు మునిశేఖర్, వెంకన్న, రాజశేఖర్,ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు..

## మత్తు ఇంజెక్షన్ల కలకలం

### చాంద్రాయణగుట్టలో మత్తు ఇంజెక్షన్ల కేసు సంచలన ఘటన

### అధిక డోస్‌తో ఇద్దరు ఆటోడ్రైవర్ల మృతి ■ ఇద్దరు వైద్యుల అరెస్ట్

**హైదరాబాద్, డిసెంబర్ 10:** హైదరాబాద్ నగర పరిధిలోని చాంద్రాయణగుట్ట పరిధిలో మత్తు ఇంజెక్షన్ల వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. మత్తుకోసం అనస్తీషియా తీసుకుని ఇద్దరు డ్రైవర్లు మృతిచెందడంతో పోలీసులు విచారణ చేపట్టి ఇద్దరు డాక్టర్లను అరెస్ట్ చేశారు. రోగులకు ఇవ్వాల్సిన డోసు కంటే ఎక్కువ మోతాదులో మత్తు ఇచ్చినందువల్లే వారు మృతిచెందినట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఇద్దరు ఆటోడ్రైవర్లు ఆటోలనే కుప్పకూలి మరణించడంతో.. ఈ వ్యవహారంపై పోలీసులు లోతుగా విశ్లేషించి కీలక విషయాలను వెలుగులోకి తెచ్చారు. ఇంజెక్షన్లు ఎక్కడి నుంచి వస్తున్నాయనే అంశంపై పలు ఆధారాలు సేకరించారు. రోగులకు చికిత్స చేసేందుకు వాడాల్సిన మత్తు ఇంజెక్షన్లను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ జైపాల్ రెడ్డి బహిరంగ మార్కెట్లో అక్రమంగా అమ్ముతున్నాడు. అతడి వద్ద నుంచి ఈ ప్రమాదకర ఇంజెక్షన్లు బయటకు వెళ్లినట్టు పోలీసులు నిర్ధారించారు. ఈ వ్యవహారంలో మరో ఆసుపత్రికి చెందిన ఇంకో వైద్యుడి పాత్ర కూడా ఉన్నట్టు దర్యాప్తులో తేలింది. ఇరువురూ కలిసి అక్రమంగా అనస్తీషియా ఇంజెక్షన్లు విక్రయిస్తున్నట్టు గుర్తించిన పోలీసులు.. ఇద్దరినీ అరెస్ట్ చేశారు. ఆసుపత్రుల్లో నిల్వ ఉన్న ఔషధాలను దారిమళ్లించి.. మత్తుకు అలవాటుపడిన వారికి అమ్ముతూ వ్యాపారం సాగిస్తున్నారని తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో శస్త్రచికిత్సల సమయంలో మాత్రమే వినియోగించాల్సిన ఇంజెక్షన్లను ఇలా బహిరంగంగా అమ్మడంతోనే ఈ దుర్ఘటన జరిగిందని భావిస్తున్నారు పోలీసులు.



**సంపాదకీయం**

# రాహుల్ కన్నా ప్రియాంక బెటర్!

లోక్‌సభలో రెండు రోజుల పాటు రెండు అంశాలపై జరిగిన చర్చలో..విపక్ష సభ్యులు మాట్లాడిన తీరును పరిశీలిస్తే.. రాహుల్ తన అపరిపక్వతను మరోమారు బయట పెట్టుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా మాత్రం పరిణతి చెందిన రాజకీయ నేతగా రాణించారు. వందేమాతరంపై చర్చలో ప్రియాంక ఓ రకంగా మోడీని అడ్డుకుని తీరారనే చెప్పాలి. నెహ్రూ ద్రోహం గురించి మోడీ మాట్లాడిన సందర్భంలో ఆమె గట్టిగానే ఎదుర్కొన్నారు. ఇవాళ జరుగుతున్న అభివృద్ధికి అంతా నెహ్రూ వేసిన పునాది అని గట్టిగా చెప్పగలిగారు. అలాగే వందేమాతరం ప్రస్తావన ద్వారా నెహ్రూను ఎండగట్టాలన్న తీరును కూడా తప్పు పట్టారు. ఒకవేళ నెహ్రూ గురించి అయితే ఓ రోజంతా చర్చిద్దామని, తిరిగి మళ్లీ నెహ్రూ జోలికి వెళ్లవద్దని అన్నారు. అయితే ఆమె మాట్లాడిన తీరు పరిణతి చెందిన రాజకీయ నేతగా కనిపించారు. సమస్యలను లోతుగా ఎత్తిచూపి మాట్లాడే సత్తా ఉన్న నేతగా కనిపించారు. రాహుల్‌తో పోలిస్తే ఆమె చాలా మెరుగైన నాయకత్వ లక్షణాలను కనబర్చారు. రాజకీయంగా మోడీని లేదా బిజెపిని ఎదుర్కొనే విషయంలో ఆమె సందర్భోచితంగా మాట్లాడ కలుగుతున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఆమె సరైన నేతగా దారి చూపగల రని భావించవచ్చు. ఎందుకంటే రాహుల్ కేవలం ఓట్ చోరీ అని నిందించడం తప్ప ఆధారాలను సమర్పించే ప్రయత్నం ఇప్పటి వరకు చేయలేదు. బీహార్‌లో ఇదే నినాదంతో పోయి బొక్కబోర్లా పడ్డారు. అయినా ఆయనలో మార్పు కనిపించడం లేదు. ఎందుకంటే పార్లమెంటులో కూడా మళ్లీ ఇదే విధంగా తన పాతపాటనే పాడారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ సర్‌ను తప్పుపట్టడమే పెద్ద తప్పు. రాజ్యాంగ వ్యవస్థను పనిచేయకుండా అడ్డుకున్నట్లేనని గురించడ లేదు. ఓట్ల తొలగింపు ద్వారా అర్హులైన ఓటర్లను గుర్తించ కేసు వేయించివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. సుప్రీం కూడా ఇదే కోరింది. కానీ రాహుల్ అది చేయలేదు. తాజాగా పార్లమెంటులోమంగళవారం సర్ ప్రక్రియపై రాహుల్ మాటలు పేలవంగా ఉన్నాయి. ప్రజలను ఆకట్టుకునేలా ప్రసంగం లేదు. అలాగే తప్పులను ఎత్తిచూపే విధంగానూ లేదు. కేవలం ఆర్ఎస్ఎస్‌ను దుమ్మెత్తి పోయడం ద్వారా మైనార్టీ ఓటు బ్యాంక్‌ను పదిల పర్చుకునే ఎత్తుగడ ప్రదర్శించారు. ఓటుచోరీ అనేది అతిపెద్ద దేశద్రోహమని, ఎన్నికల సంఘంతో కలిసి భాజపా దానికి పాల్పడుతోందని రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ఎన్నికల సంస్కరణలపై మంగళవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చలో ఆయన తన పాత మాటలనే రికార్డుగా వినిపించారు. దేశ మూలాలనే దెబ్బతీసేలా ఓటుచోరీ జరుగుతోందని, సంస్థాగత వ్యవస్థ మొత్తాన్ని ఆరెస్సెస్ టోకుగా గుప్పిట పట్టిందని చెప్పడం ద్వారా వ్యవస్థను తప్పు పట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం ఇదే చేసేది. భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఎన్నికల సంఘాన్ని భాజపా వాడుకుంటోందని ఆరోపించడం ద్వారా ప్రజలల్లో తనకు ఇమేజ్ లేదని చెప్పుకున్నారు. ఎన్నికలకు నెల ముందు మెషీన్ రీడబుల్ నమూనాలో అన్ని పార్టీలకూ ఓటర్ల జాబితాలు ఇవ్వండని అడగడంలో తప్పు లేదు. కానీ నేతలు నిష్పాక్షికంగా ఉన్నప్పుడే ఎన్నికల సంస్కరణలు సాధ్యమవుతాయని గుర్తించాలి. కాంగ్రెస దేశంలో దశాబ్దాల పాటు పాలన చేసింది. దీనికి ఓట్ చోరీ కారణమని అనుకోవాలా అన్నది రాహుల్ చెప్పాలి. ఎన్నికలవ్యవస్థపై దాడిచేసే బదులు నిర్మాణాత్మక విమర్శలు,సూచనలు చేసివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. అందుకే ప్రియాంకతో పోలిస్తే రాహుల్‌కు విషయ పరిజ్ఞానం తక్కువని తేలిపోయింది. నిజానికి బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును పరిశీలిస్తే విపక్షం పట్ల ప్రజల విముఖత ప్రతిబింబించింది. లాలూ కుటుంబంతో పాటు, రాహుల్ తీరుపై అంటే కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా ప్రతిబింబించింది. ఈ ప్రజాతీర్పును ప్రజలంతా అంగీకరించి నా, రాహుల్ మాత్రం అంగీకరించడం లేదు. ఓట్ చోరీ మాయలో పడ్డ ఆయన మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. సర్ ప్రక్రియను కూడా తప్పు పట్టడం రాజ్యాంగ వ్యవస్థల పనితీరును ప్రశ్నించడం తప్ప మరోటి కాదు. రాహుల్ పరిణతి రాజకీయాలు అవలంబించాలి. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజలు నిరంతరం ఎదుర్కొం టున్న ప్రధాన విషయాలను ప్రస్తావించడం లో రాహుల్ విఫలం అయ్యారు. పార్లమెంటులో అనేక సమస్యలను ప్రస్తావించి చర్చించడంలో విపక్షనేతగా విఫలం అయ్యారు. విపక్షాల పట్ల ప్రజల్లో ఒక ప్రగాఢ ఆకాంక్షను నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. బిహార్‌లో మాత్రమే ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పుడు బెంగాల్ సహా అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ మొదలయ్యింది. బెంగాల్లో మమతా బెనర్జీ కూడా మొత్తం పక్రియనే వ్యతిరేకిస్తోంది. ఇది ఎంతవరకు సబబో ఆలోచించాలి. ప్రజలు ఏం సమస్యలు ఎదుర్కొంటున్నారో..పార్లమెంట్ వేదికగా వాటికి ఎలాంటి పరిష్కారం చూపాలో అన్నది వపక్ష పార్టీల బాధ్యత. కేవలం ఓట్ చోరీ నినాదాలతో ముందుకు నడవలేరు. పార్లమెంటు లో ఆయా అంశాలపై చర్చ జరక్క పోవడానికి కారణం ఇదే. అందుకు విపక్ష పార్టీలదే బాధ్యత. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు ప్రియాంకను విపక్ష నేతగా చేస్తే మంచిది. ఆమెను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. అప్పుడు ఆమె రాటుదేలుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు.

# 'మీ డబ్బు.. మీ హక్కు'

- అన్‌క్లెయిమ్డ్ మనీ సొంతం చేసుకోండి
- ప్రధాని మోడీ మరోమారు పిలుపు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 10:** అన్‌క్లెయిమ్డ్ ఆస్తు విషయంలో ఆర్‌బీఐ ఇటీవలే మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ప్రజల్లో కొంత చైతన్యం వచ్చింది. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా తనవంతుగా ప్రచారం మొదలు పెట్టారు. ఇది ప్రజలకు మేలు చేస్తుందన్న భావనలో ఆయన ప్రకటన చేశారు. క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు అందుకో ఓసం 'మీ డబ్బు.. మీ హక్కు' మూమెంట్‌లో పాల్గొనాలని సూచించారు. భారతీయ బ్యాంకుల్లో రూ.78 వేల కోట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల్లో రూ.14వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.3వేల కోట్లు, డివిడెండ్లు రూ.9వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని చెప్పారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్లను ఆయన పంచుకున్నారు. ప్రతి పౌరుడు తనకు చెందిన సొమ్మును తిరిగి పొందేందుకే ఈ మూమెంట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మర్చిపోయిన ఆస్తులను కొత్త అవకాశంగా మార్చుకోండి. ఈ మూమెంట్‌లో భాగంకండి. ఈ ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యపరు–స్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ.. ఇవన్నీ ఎన్నో కుటుంబాలు కష్టపడి కూడబెట్టిన పొదుపు, పెట్టుబడులను సూచిస్తున్నాయని ప్రధాని తన పోస్టులో రాసుకొచ్చారు. ఇప్పటికే రూ.2వేల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరుల్లో అర్హులైన హక్కుదార్లకు అందించామని చెప్పారు. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు, బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదారులకు, చట్టబద్ధ వారసులకు అందించాలన్న లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులోభాగంగా ప్రజాప్రతినిధులు, జిల్లా పాలనా అధికారులు, ఆర్థిక సేవల అధికారులతో అక్టోబరు నుంచి డిసెంబరు 5 వరకు 477 జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పా ఓటుచేసి.. ప్రజలకు అవగాహన కల్పించినట్లు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ ఇప్పటికే వెల్లడించారు. ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన తమ ఆర్థిక ఆస్తులను పొందేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను తెలిపి, సందేహాలను పరిష్కరించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించే విషయాలను ప్రధాన ప్రాంతీయభాషల్లోనే అందించామని వెల్లడించారు. తక్కువ సమయం నిడివితో వీడియో ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించామని మంత్రి తెలిపారు. ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్‌ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్‌ఏ లాంటి ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయని వివరించారు. ప్రజలు తమ అన్‌క్లెయిమ్డ్ ఆర్థిక ఆస్తులను కనుగొనడంలో ఆర్‌బీఐ 'ఉద్గమ్', ఐఆర్‌డీఏఐ 'బీమా భరోసా', సెబీ 'మిత్రా' సమర్థంగా ఉపయోగపడుతున్నాయని మంత్రి తెలిపారు.

# కేంద్ర సమచార, కేంద్ర విజిలెన్స్ కమిషన్ నియామకం

**ప్రభుత్వ ప్రతిపాదనలను విభేదించిన రాహుల్**



**న్యూఢిల్లీ, డిసెంబర్ 10:** కేంద్ర సమచార కమిషన్, కేంద్ర విజిలెన్స్ కమిషన్ వంటి పారదర్శక సంస్థలకు కీలక నియామకాలు ఖరారు చేయడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని ప్యానల్ బుధవారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశం ముగిసింది. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో పాటు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు. సుమారు 88 నిమిషాల పాటు సమావేశం జరిగింది. రాహుల్ గాంధీ పీఎంఓ కార్యాలయానికి ఒంటిగంట సమయానికి చేరుకున్నారు. 1.07 నిమిషాలకు సమావేశం ప్రారంభమైంది. సమావేశానంతరం అత్యున్నత పదవులకు మోదీ ప్రతిపాదించిన పేర్లతో విభేదిస్తున్నట్టు రాహుల్ పేర్కొంటూ లిఖితపూర్వకంగా తన అసమ్మతి నోట్‌ను అందజేశారు. కాగా, ప్రస్తుతం సీఐసీలో ప్రధాన సమాచార కమిషనర్‌తో పాటు 8 కమిషనర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 30,838 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనికి ముందు సీఐసీగా ఉన్న హీరాలాల్ సామరియా 65 ఏళ్లు పూర్తికావడంతో గత సెప్టెంబర్ 13న పదవీ విరమణ చేశారు. 2023 నవంబర్ 6న ఆయన సీఐసీగా నియమితులయ్యారు. కాగా, మే 21న సీఐసీ పోస్టుకోసం అడ్వర్‌టైజ్‌మెంట్ ఇవ్వడంతో 83 అప్లికేషన్లు వచ్చినట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెర్సనల్ అండ్ ట్రైనింగ్ అధికారులు తెలిపారు. సీఐసీలోని సమాచార కమిషనర్ ఖాళీలకు 161 అప్లికేషన్లు అందినట్టు ప్రభుత్వం తెలిపింది. నిబంధనల ప్రకారం, సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 12(3) కింద చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ నియామకాలకు పేర్లను ప్రధాని సారథ్యంలోని కమిటీ ఎంపిక చేసి తమ సిఫార్సులను రాష్ట్రపతికి పంపుతుంది. రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత నియామక ఉత్తర్వులు జారీ అవుతాయి.

# మోడీ సగం పనిదినాలు విదేశాల్లోనే..

**బీజేపీ విమర్శలపై ప్రియాంక ఎద్దేవా**







**న్యూఢిల్లీ, డిసెంబర్ 10:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిసెంబర్ 15 నుంచి 20 వరకు జర్మనీలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరగుతుండగా.. రాహుల్ విదేశీ పర్యటనపై బిజెపి నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. రాహుల్ ఈజ్ ఎల్ఓపి అంటే లీడర్ ఆఫ్ పర్యటన్ పేరుతో కామెంట్లు చేస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై ప్రియాంక గాంధీ స్పందించారు. దేశ ప్రధాని మోడీ సగం పనిదినాలు దేశం బయటే గడుపుతున్నారని బిజెపి నేతలకు కౌంటర్ ఇచ్చారు. డిసెంబర్ 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాహుల్ గాంధీ జర్మనీలో భారతీయులతో భేటీకానున్నారు. ఈ పర్యటనలో ఆయన జర్మనీ మంత్రుల్ని కూడా కలవనున్నారు. రాహుల్ ఈజ్ ఎల్‌వోపీ అంటే లీడర్ ఆఫ్ పర్యటన్ అని బీజేపీ పేర్కొన్నది. విదేశీ నాయకుడు తన నచ్చిన అంశాన్ని చేస్తున్నారని, విదేశీ టూరుకు వెళ్తున్నారని, శీతాకాల పార్లమెంట్ సమావేశాలు డిసెంబర్ 19వ తేదీ వరకు ఉన్నాయని, కానీ రాహుల్ గాంధీ మాత్రం డిసెంబర్ 15 నుంచి 20 వరకు జర్మనీకి వెళ్తున్నట్లు బిజెపి ప్రతినిధి షెహజాద్ పూనావాలా తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల సమయంలోనూ రాహుల్ విదేశాల్లో ఉన్నారని, జంగిల్ సఫారీ చేసినట్లు ఆరోపించారు. ఃహుల్ గాంధీ పర్యటనపై అనేక విమర్శలు వస్తున్న సమయంలో.. ప్రియాంకా గాంధీ స్పందించారు. దేశం బయటే తన సగం దినాలను ప్రధాని మోదీ గడిపేస్తున్నారని, మరి ప్రతిపక్ష నేతపై ఎందుకు ప్రశ్నలు వేస్తున్నారని ప్రియాంకా కౌంటర్ ఇచ్చారు. జర్మనీ టూరులో రాహుల్ గాంధీతో, కాంగ్రెస్ సీనియర్ నేత శ్యామ్ పిట్రోడా కూడా వెళ్తున్నారని బల్విందర్ సింగ్ తెలిపారు.



# ఎన్డీయే ఎంపీలకు నేడు మోడీ విందు


**ఉభయ సభల్లో వ్యూహంపై చర్చించే అవకాశం**

**న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్డీయే భాగస్వామ్య పార్టీల ఎంపీలకు తన నివాసంలో ప్రత్యేక విందు ఇవ్వనున్నారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు ఈ విందు సమావేశం ఏర్పాటు చేశారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున ఉభయసభల్లో పరస్పర సహకారం, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని పటిష్టం చేయడంలో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. ఎన్డీయే విస్తృత ఎజెండా, ప్రస్తుత సమావేశాల్లో ప్రభుత్వ ఎజెండాపై ప్రధాని ఈ సమావేశంలో ఎంపీలతో ప్రస్తావిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ పక్రియ అంశం కూడా విందు సమావేశంలో ప్రస్తావనకు రావచ్చని తెలుస్తోంది. సీనియర్ మంత్రులు, ఎ÷–లోర్ లీడర్లు, భాగస్వామ్య పార్టీల ఎంపీలు ఈ విందులో పాల్గొంటారు. పశ్చిమబెంగాల్, తమిళనాడు, అసోంలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాల కోసం అనుసరించాల్సి వ్యూహంపై కూడా ఎన్డీయే భాగస్వాములతో చర్చించే అవకాశం ఉందని అంటున్నారు. శ్చిమబెంగాల్‌లో ఇప్పటికే పార్టీ సంస్థాగత కార్యక్రమాలను బీజేపీ ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా డిసెంబర్ 20న పశ్చిమబెంగాల్‌లో ప్రధాని పర్యటిస్తారని, నడియా జిల్లాలో పబ్లిక్ ప్రోగ్రాంలో పాల్గొంటారని తెలుస్తోంది. ఈ సందర్భంగా బీజేపీ బెంగాల్ నాయకత్వంతో వ్యూహాత్మక సమావేశాలను కూడా మోదీ నిర్వహించనున్నారు. సంస్థాగత సన్నద్ధతను సమీక్షించనున్నారు. వచ్చే ఏడాది జనవరిలో పశ్చిమబెంగాల్‌లో నాలుగు నుంచి ఆరు పరివర్తన్ యాత్రలు నిర్వహించేందుకు కూడా బీజేపీ సన్నాహాలు చేస్తోంది. మోదీ స్వయంగా ఒక యాత్రలో పాల్గొంటారు.

# జనావాసాల్లో చిరుత దాడి

**దాడిలో ఏడుగురికి గాయాలు**

**ముంబై, డిసెంబర్ 10:** మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నగరంలో బుధవారం చిరుత సంచారం కలకలానికి దారి తీసింది. శివ్‌నగర్ ప్రాంతంలో జనావాసాల్లోకి చిరుత దూసుకురావడంతో స్థానికులు కంగారు పడిపోయారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో సుమారు ఏడుగురు గాయపడ్డారు. అయితే, ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు ఉదయం 7.30 గంటలకు చిరుత సంచారం గురించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందిందని హానరరీ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అధికారి మీడియాకు తెలిపారు. దీంతో, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆదేశాల మేరకు రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్.. ట్రాన్సిట్ ట్రీట్‌మెంట్ సెంటర్ బృందాన్ని ఘటనా స్థలానికి పంపించారు. ఉదయం 9.30 గంటల సమయంలో రంగంలోకి దిగిన సిబ్బంది చిరుతకు మత్తు మందు ఇచ్చి బంధించారు. గంటసేపట్లో ఈ ఆపరేషన్ పూర్తయ్యింది. అటవీ శాఖ సిబ్బంది చిరుతను ట్రాన్సిట్ ట్రీట్‌మెంట్ కేంద్రానికి తరలించారు. అది మగ చిరుత అని, సుమారు మూడేళ్ల వయసు ఉంటుందని తెలిపారు. ఇక ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. జనావాసాల మధ్యకు వచ్చిన చిరుత భవంతుల మధ్య దూకుతూ ఇబ్బంది పడింది. ఓ భవనంపై నుంచి మరోచోటుకు దూకే ప్రయత్నంలో పట్టుకోల్పోయి గోడను పట్టుకుని వేల్లాడింది. కాసేపు శ్రమించి చివరకు భవనంపైకి చేరుకుంది. చుట్టుపక్కల వారందరూ మేడలపైకి ఎక్కి ఈ సన్నివేశాలను ఆశ్చర్యపోతూ చూశారు. చిరుతను బంధించామని, స్థానికులకు అపాయం తప్పిపోయిందని మహారాష్ట్ర అటవీ శాఖ మంత్రి గణేశ్ నాయక్ తెలిపారు.



ఆ ప్రాంతంలో చిరుత మళ్లీ కనబడితే ఫారెస్టు డిపార్ట్‌మెంట్ అధికారులు స్థానికులను అప్రమత్తం చేస్తారని అన్నారు. చిరుత దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని తాను సందర్శించానని, వారికి ఎలాంటి అపాయం లేదని తెలిపారు

# ప్రజలు మెచ్చేలా పరిపాలన



మొదటి పేజీ తరువాయి

పెంపునకు తీసుకోవాల్సిన అంశాలు, అమలు చేయాల్సిన ప్రణాళికపై చర్చించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోని మొదటి రెండు త్రైమాసికాల్లో సాధించిన ఆర్థిక ఫలితాలపై సమావేశంలో సమీక్షించారు. అలాగే మూడు, నాలుగు త్రైమాసికాల్లో సాధించాల్సిన లక్ష్యాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. జీఎస్డీపీ, కేపీఐ, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్, డేటా డ్రివెన్ గవర్నెన్సు అంశాలపై సూచనలు చేశారు. దీంతో పాటు సూపర్ సిక్స్ పథకాల, పౌరసేవలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఫైళ్ల క్లియరెన్సు, ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక, అవేర్, డేటా లేక్, ఐటీ అప్లికేషన్లపై సమావేశంలో అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలు, ఫిర్యాదులు వాటి పరిష్కారంపై హెచ్ఓడీలకు సీఎం సూచనలు చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు వాటి ఫలితాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి ప్రారంభోపన్యాసంలో మాట్లాడుతూ.. "18 నెలల పాలను సమీక్షించుకుని ఈ ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సిన లక్ష్యాల గురించి చర్చించుకుని ఆ దిశగా అందరూ పని చేయాలి. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోంది... ప్రజలు మెచ్చే పాలన అందించాలి. ఫైళ్లు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారంతో డేటా లేక్ వ్యవస్థ సిద్ధం అయ్యింది. ఈ సమాచారంతో ఇకపై డేటా డ్రివెన్ గవర్నెన్స్ దిశగా అందరూ పని చేయాలి. నాలెడ్జ్ ఎకానమీ దిశగా ఏపీ అడుగులు వేస్తోంది. అందుకే పెద్ద ఎత్తున కంపెనీలు వస్తున్నాయి. విశాఖలో 1 గిగా వాట్ సామర్ధ్యంతో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. ప్రధానిని మైక్రో సాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కలిశారు. రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమని చెప్పారు. సుపరిపాలన కోసం అవసరమైతే బిజినెస్ రూల్స్ మార్చుకోవచ్చు. ప్రజల అవసరాల కోసం రాజ్యాంగాన్నే చాలాసార్లు సవరణలు చేశారు. ప్రజలు తమ పనుల కోసం ప్రభుత్వ ఆఫీసులకు వచ్చే పరిస్థితి ఉండకూడదు. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు చేరే పరిస్థితి రావాలి. గత పాలకులు పూర్తిగా కేంద్ర ప్రాయోజిత పథకాలను అస్తవ్యస్తం చేశారు. గత ప్రభుత్వం అవలంభించిన విధానాలతో కేంద్ర ప్రభుత్వం ఏకంగా నిబంధనలే మార్చేసింది. ఆగిపోయిన కేంద్ర పథకాలను తిరిగి పునరుద్దరించాం. వీటిని మరింత సమర్ధవంతంగా వినియోగించుకోవాలి. గత పాలకుల నిర్వాకం వల్ల ఏపీ బ్రాండ్ దెబ్బతింది. దానివల్ల అభివృద్ధి ఆగిపోయింది. ఆదాయం తగ్గింది. క్రెడిట్ రేటింగ్ తగ్గిపోవటం వల్ల వడ్డీల భారం పెరిగింది. ఇప్పుడు ఉన్న అప్పును, వడ్డీలను రీ-షెడ్యూలింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి. అన్ని ప్రభుత్వ శాఖలూ, విభాగాలు ఆడిట్ పరిధిలోకి రావాల్సిందే. ప్రధాని నరేంద్ర మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి సుపరిపాలన, అభివృద్ధి, రాష్ట్ర పునర్నిర్మాణ హామీ ఇచ్చాం. ఆ దిశగా పాలన సాగేలా మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ పని చేయాలి" అని సీఎం స్పష్టం చేశారు. "స్వర్ణాంధ్ర విజన్ యూనిట్లను రేషనలైజ్ చేసి గ్రామ, పట్టణ ప్రాంతాల్లో అవసరమైనట్టుగా విధులు చేపట్టేలా మార్చుకుందాం. ప్రతీ ప్రభుత్వ శాఖ ఓ మంచి ఫలితాల కోసమే పనిచేస్తోంది. ఆ ప్రయోజనాలు ప్రజలకు తెలియాలి. విద్య, విద్యుత్, నీటి భద్రత, వ్యవసాయం, వైద్యం సహా వివిధ శాఖల్లో సంస్కరణలు అమలు చేస్తున్నాం. ప్రజలపై భారం పడకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే... సంస్కరణల ద్వారా ప్రజలకు మేలు జరిగేలా చూస్తున్నాం. పీపీఏలను రద్దు చేసి గత ప్రభుత్వం రూ.9 వేల కోట్ల ప్రజా ధనం దుర్వినియోగం చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో బహిరంగ మార్కెట్ లో యూనిట్ విద్యుత్ ను రూ.5.19 చొప్పున కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు దానిని రూ.4.92కు తగ్గించాం. మొత్తంగా రూ. 9 వేల కోట్ల మేర విద్యుత్ ఛార్జీలు పెంచుకోవడానికి ఈఆర్సీ అనుమతి ఇచ్చింది. కానీ దీని వల్ల ప్రజలపై భారం పడుతుంది. అందువల్ల ఈఆర్సీ సూచనల అమల ఆలోచన చేయడం లేదు. ప్రజలపై భారం వేయకూడదని నిర్ణయించాం. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం. ఐదేళ్లల్లో విద్యుత్ కొనుగోలు ధరను రూ. 4కు తగ్గించేలా కృషి చేస్తున్నాం. అందరం కలిసి సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశాం. ఒక్క పెన్షన్లలోనే ఇప్పటి వరకు రూ. 50 వేల కోట్లకు పైగా పేదలకు పంపిణీ చేశాం. ఏపీ బ్రాండ్ అనేది చాలా స్ట్రాంగ్ బ్రాండ్. గత పాలకుల వల్ల ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీ బ్రాండ్ తిరిగి తీసుకురాగలిగాం. విశాఖ సదస్సులో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. మన యువతకు ఉద్యోగాలు కూడా వస్తాయి. ఎప్పటికప్పుడు ఎస్ఐపీబీలు పెట్టుకుని పెట్టుబడులకు ఆమోదం తెలుపుతున్నాం. మొదటి త్రైమాసికంలో 12.02 శాతం గ్రోత్ రేట్ వచ్చింది. రెండో త్రైమాసికంలో 11.28 శాతం వృద్ధి నమోదు అయ్యింది. 8.70 శాతం జాతీయ సగటు కంటే ఎక్కువ ప్రగతి సాధించగలిగాం. ఇక భవిష్యత్ కాలానికి 17.11 శాతం లక్ష్యంగా పెట్టుకున్నాం. నీటి భద్రత విషయంలో ముందు చూపుతో పని చేశాం. సాగు నీటి ప్రాజెక్టుల్లో 944 టీఎంసీల నిల్వ చేసుకున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. "ఉన్నతాధికారులంతా శాస్త్రీయంగా ఆలోచన చేసి అభివృద్ధికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. నిధుల లభ్యత తక్కువగా ఉన్నా... అభివృద్ధి పనులు ఆగకుండా చూడాలి. ఈ విధంగా చేయాలంటే అధికారులు వినూత్నంగా ఆలోచన చేయాల్సి ఉంటుంది. రాష్ట్రాన్ని జోన్లుగా, రీజియన్లుగా, కారిడార్లుగా, క్లస్టర్లుగా హబ్ లుగా విభజించుకుని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. అన్ని శాఖలు, అన్ని ప్రభుత్వ సేవల్లో ప్రజల్లో సంతృప్త స్థాయిని నమోదు చేస్తున్నాం. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలతో చక్కగా వ్యవహరించాలి. టీటీడీ పనితీరు మెరుగు అవుతోంది. కానీ దేవదాయ శాఖ పని తీరు మెరుగు పడడం లేదు. అన్ని ప్రభుత్వ శాఖలు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలి. జనవరి 15 నాటికి అన్ని సేవలూ ఆన్లైన్లో సేవలందించే పరిస్థితి రావాలి" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంక్

## సీఎం చంద్రబాబు వినూత్న నిర్ణయం

**అమరావతి:** రాష్ట్రంలో రైతులపై సాగు వ్యయ భారాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తూ, ఆధునిక యంత్ర పరికరాలను రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు 'అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంక్' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ధాన్యం, పత్తి, మిర్చి సహా వాణిజ్య పంటల కొనుగోళ్లపై బుధవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. శాస్త్రీయ విధానంలో పంటల ప్రణాళిక, ఆధునిక యంత్రాలు, డ్రోన్ల వినియోగం ద్వారా సాగు ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక వెబ్ సైట్‌ను ప్రారంభించి, అందులో అందుబాటులో ఉన్న పరికరాల వివరాలను పొందుపరచాలని సూచించారు. ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు ఉండాలని, వరికి ప్రత్యామ్నాయంగా రాగులు, జొన్నలు, సజ్జల వంటి చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు.

**ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష**

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు సీఎంకు వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 2,606 కొనుగోలు కేంద్రాల ద్వారా 18.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. రైతులకు 7.39 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రూ.4,085 కోట్లు చెల్లించామని వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 32 శాతం అధికమని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీఎం, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఎన్డీఏ ప్రజాప్రతినిధులంతా కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు భరోసా ఇవ్వాలని సూచించారు. రబీ సీజన్‌లో ప్రజలు తినే వరి రకాల సాగుతో పాటు వాటి కొనుగోలు, అంతర్జాతీయ మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు.

**సీసీఐ తీరుపై సీఎం అసహనం**

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వ్యవహరిస్తున్న తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ల కేటాయింపులో ఎదు-రవుతున్న సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసే విషయంలో అనవసర ఇబ్బందులు సృష్టించవద్దని హెచ్చరించారు. ఈ సమస్యలపై వెంటనే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులకు సూచించారు.

**వాణిజ్య, ఉద్యాన పంటలపై దృష్టి**

మిర్చి వంటి పంటలకు మెరుగైన మార్కెట్ కల్పించేందుకు విశ్లేషణా సంస్థలతో సమన్వయం చేసుకోవాలని సీఎం అన్నారు. ధరలు ఒక్కసారిగా పడిపోకుండా వాణిజ్య పంటల హార్వెస్టింగ్ ప్రక్రియలో 'రేషనలైజేషన్' విధానాన్ని పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దీనివల్ల దశలవారీగా పంట మార్కెట్‌కు వచ్చి గిట్టుబాటు ధర లభిస్తుందని వివరించారు. అరటి, నిమ్మ వంటి ఉద్యాన పంటల కొనుగోలుదారులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో 45,420 హెక్టార్లలో సాగవుతున్న సుబాబుల్ రైతులకు మార్కెట్‌కు అనుగుణంగా ధర దక్కేలా చూడాలన్నారు. రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ఉల్లి పంటకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశం లో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమెరికాలో బిజీగా లోకేశ్ పర్యటన

## గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌లతో భేటీ




**శాన్ ఫ్రాన్సిస్కో:** రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో అమెరికాలో పర్యటిస్తున్న ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ టెక్ దిగ్గజ సంస్థల సీఈవోలతో సమావేశమయ్యారు. శాన్ ఫ్రాన్సిస్కోలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌లతో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో జరిగిన సమావేశంలో విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న 15 బిలియన్ డాలర్ల ఏఐ డేటా సెంటర్ పనుల పురోగతిపై ప్రధానంగా చర్చించారు. ఈ భారీ పెట్టుబడికి ముందుకు వచ్చినందుకు గూగుల్ బృందానికి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో రాబోతున్న డ్రోన్ సిటీలో గూగుల్ డ్రోన్ అసెంబ్లీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన సుందర్ పిచాయ్, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను సంస్థలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అమెరికా వెలుపల గూగుల్ పెడుతున్న అతిపెద్ద ఎఫ్‌డీఐ విశాఖ డేటా సెంటర్ అని ఆయన పేర్కొన్నారు. ఈ భేటీలో గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ కూడా పాల్గొన్నారు. అనంతరం అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖలో అడోబ్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, శంతను నారాయణన్ డైరెక్టర్‌గా ఉన్న జైర్, కేకేఆర్ వంటి సంస్థల పెట్టుబడులను కూడా ఏపీకి తీసుకురావాలని కోరారు. విశాఖలోని ఫార్మా జోన్‌లో జైర్ ఎలాంట్ ఏర్పాటు, ఆరోగ్య సంరక్షణ రంగంలో కేకేఆర్ పెట్టుబడులు పెట్టేలా సహకరించాలని విన్నవించారు. మంత్రి లోకేష్ చేసిన విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన శంతను నారాయణన్, తన సహచరులతో చర్చించి తగిన నిర్ణయం ప్రకటిస్తామని హామీ ఇచ్చారు.

# పల్లెలే దేశానికి వెన్నెముక



మొదటి పేజీ తరువాయి

ద్వారా పదోన్నతలు ఎలా వచ్చాయో అందరికీ బాగా తెలుసన్నారు. మంగళగిరిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో ఆయన మాటామంతీ నిర్వహించారు. ఉద్యోగులు శాఖాపరమైన సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు ఇవ్వకపోవడం సరికాదనిపించింది. గత ప్రభుత్వంలో ప్రతి పోస్టుకు, బదిలీకి ఓ రేటు పెట్టారు. ఈ పద్ధతిని పూర్తిగా నిర్మూలించాలని చెప్పాను. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లుల చెల్లింపు చేయాలని ఆదేశించానని వెల్లడించారు. పంచాయతీరాజ్ అనుబంధ శాఖల్లో 2లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. సీనియారిటీ, సిన్సియారిటీ, పనితీరు ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని అధికారులకు చెప్పా. మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సులు కూడా ఆ పరిధిలో ఉంటేనే చెప్పాలని సూచించాను. 10 వేల మందికి పదోన్నతులు కల్పించాం. పదోన్నతి వచ్చిన ఉద్యోగి ఇంట్లో పండుగ వాతావరణం ఉంటుంది. జీతాలు ఇంకా పెరగాలంటే రాష్ట్ర ఆదాయం పెరగాలి. ఆదాయం పెంపుపై అధికారులు దృష్టి పెట్టాలని అన్నారు. శశిభూషణ్‌కుమార్, కృష్ణతేజ, వెంకటకృష్ణ వంటి అధికారుల కృషి ప్రశంసనీయం. నా తండ్రి కూడా ప్రభుత్వ ఉద్యోగే.. అందుకే ఉద్యోగులపై సానుకూల భావన ఉందని పవన్ అన్నారు. కొన్ని సందర్భాల్లో నిర్ణయం తీసుకుంటే తప్పు.. తీసుకోకుంటే ఒప్పు అయిన పరిస్థితులు ఎదురయ్యాయని చెప్పుకొచ్చారు. అయినా కూడా తన పని తాను చూసుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎంగా తన సొంత తెలివి తేటలు ఏమీ కూడా వాడడంలేదన్నారు. బలమైన అధికారులు తనతో ఉన్నారని.. రిఫామ్స్ తీసుకువచ్చి పనిచేశారని అన్నారు. గతంలో చాలా అంశాల్లో పారదర్శకత లేదని తన దృష్టికి తీసుకు వచ్చారని.. సమీక్షల సమయాల్లో చిన్న చిన్న మార్పులు తీసుకువచ్చి పని చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించామని తెలిపారు. తన తండ్రి ఒక ప్రభుత్వ ఉద్యోగి అని.. తనకు ఉద్యోగులంటే ఎనలేని గౌరవం ఉందని పేర్కొన్నారు. ఇంట్లో, ఆఫీసుల్లో ఉద్యోగులకు ఉండే సాధక బాధకాలపై తనకు అవగాహన ఉందని చెప్పుకొచ్చారు. ఉద్యోగులకు ఏమి చేయాలని ఆలోచన చేస్తే.. రిఫామ్స్ తేవాలని అధికారులు చెప్పారని అన్నారు. కష్టపడి పని చేసే వారికి ఎదుగుదల ఎంతో ముఖ్యమని భావించి అమలు చేశామని డిప్యూటీ సీఎం అన్నారు. గత ప్రభుత్వంలో రోడ్లు, మౌలిక వసతులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వారు ఉద్యోగుల ఇబ్బందులను కూడా కనీసం పట్టించుకోలేదన్నారు. తాము ఉద్యోగుల ఇబ్బందులు, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రణాళికలు అమలు చేశామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో దాదాపు రెండు లక్షల మంది అవుట్ సోర్సింగ్‌లో ఉన్నారని.. వీరికి పదోన్నతలు ఎలా చేయాలనే అంశంపై మాట్లాడితే వెంకటకృష్ణ వెన్నెముకలాగా పనిచేశారని తెలిపారు. నేటికీ మన దగ్గర వ్యవస్థలు బలంగా ఉన్నాయంటే వెంకట కృష్ణ, శశిభూషణ్ లాంటి అధికారులు ఉండటమే కారణమని చెప్పారు. ఇదంతా ఒక్కరు చేసింది కాదని.. అందరూ సమిష్టిగా అధికారుల సమూహం పని చేయడం ద్వారానే ఈ ఫలితాలు వచ్చాయన్నారు. తాను ఎక్కడా జోక్యం చేసుకోలేదని.. క్లీన్ గవర్నెన్స్ కావాలని మాత్రమే అధికారులకు చెప్పానని తెలిపారు. తన తండ్రి తాలూకా అనుభవం తనకు పని చేసింది కాబట్టే.. సీనియారిటీ, క్యాపబులిటీ చూడాలని మాత్రమే చెప్పానన్నారు. బదిలీలు, పదోన్నతులపై అనేక మంది మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా సిఫార్సు లెటర్లు ఇచ్చారని.. అయితే వారు సిఫార్సు చేసిన అధికారికి అర్హత ఉంటేనే చేయాలని స్పష్టంగా చెప్పామన్నారు. ఉమ్మడి ఏపీలో కూడా ఈ విధానం అమలు కాలేదని.. ఈ కూటమి ప్రభుత్వంలోనే సాధ్యం అయ్యిందని పవన్ చెప్పారు. గ్రూప్ 1 ద్వారా ఎంపీడీఓలు, డీడీలుగా పదోన్నతిని చట్టబద్ధంగా అమలు చేశామని అన్నారు. మహిళలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేధింపులు రాకుండా చూడాలని సూచించారు. ఉద్యోగులపై దాడి జరిగితే మాత్రం క్షమించేది లేదని.. వారి రక్షణ చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. అది ప్రజాప్రతినిధి అయినా, రాజకీయ నేత అయినా చర్యలు తీసుకుంటామని అన్నారు. తన శాఖ పరిధిలో ఉన్న అధికారిని దూషిస్తే.. చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఉద్యోగులు, సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని పవన్ తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ఉద్యోగులదే కీలక బాధ్యత అని.. మరింత విస్తృతంగా సేవలు అందించాలని అన్నారు. ప్రస్తుతం తీసుకు వచ్చిన సంస్కరణలు నేడు ఆరంభం మాత్రమే అని.. ముందు ముందు చట్టబద్ధంగా మరిన్ని సంస్కరణలు చేస్తామని వెల్లడించారు. 'ప్రతి ఉద్యోగి నా శాఖల్లో నా కుటుంబ సభ్యుడే.. ప్రజలకు సేవలు చేయడం మీ వంతు.. మిమ్మల్ని మంచిగా చూడటం మా బాధ్యత. మీకు ప్రమోషన్లు వస్తే ఎంత ఆనందం చూపారో.. మీ వద్దకు వచ్చే పౌరుడు కూడా మీ సేవలు ద్వారా అంతే ఆనందం పొందాలి. తప్పు చేస్తే నాతో సహా ఎవరైనా శిక్షార్హులే అనేది అందరూ గుర్తుంచుకోండి. పంచాయతీరాజ్ శాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఆమోదించాలని కమిషనర్‌ను కోరుతున్నాను' అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# తిరుమలలో దుపట్టా మోసం

**తిరుపతి :** తిరుమల దేవస్థానంలో రూ.54 కోట్ల నకిలీ పట్టు దుపట్టా మోసం బయటపడింది. ఈ విషయమై ఏసీబీ దర్యాప్తు ప్రారంభించింది. దీంతో త్వరలోనే మరిన్ని వివరాలు బయటపడనున్నాయి. అయితే, తాజాగా దీనిపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఓ జాతీయ మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'ఏదైనా దేవస్థానంలోకి వెళితే.. మీకు కొంత దుష్ప్రవర్తన కనిపిస్తుంది. పరకామణి విషయంలోనూ చాలా మంది చట్ట విరుద్ధంగా వ్యవహరించారు. టీటీడీలో ఎప్పటినుంచో కొంతమంది ఇష్టమెచ్చినట్లుగా చేశారు. ఈ మోసం ఇప్పుడు వెలుగులోకి రావడానికి ఏకైక కారణం.. మనకు బలమైన టీటీడీ బోర్డు, ప్రభుత్వం ఉండటమే. నేడు మనందరికీ ముఖ్యమంత్రి నుంచి మార్గదర్శకత్వం ఉంది. సరైన ప్రణాళికులతో ముందుకు సాగుతున్నాం. గతంలో మేము పుకార్లను మాత్రమే విన్నాం. ఇప్పుడు అక్కడ ఏం జరిగింది, ఏం చేశారో నిజాలు తెలుస్తున్నాయి. భారతదేశంలోని ఇతర మతాలతో పోలిస్తే.. ప్రభుత్వ చర్యలు, బహిరంగ ప్రకటనలకు సంబంధించి హిందువులను అవమానంగా చూస్తున్నారు. నేను గతంలో చెప్పినట్లుగా హిందువులను లక్ష్యంగా చేసుకుని నిలదీస్తున్నారు' అని ఉప ముఖ్యమంత్రి పవన్ చెప్పారు.

# పరకామణి చోరీ కేసులో చట్టప్రకారం చర్యలు

## ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు ..విచారణ 16కు వాయిదా

**అమరావతి :** తిరుమల పరకామణి చోరీ కేసులో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చోరీ కేసులో ఎన్వీఆర్ నమోదు చేసి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకొనేందుకు సీఐడీ, ఏసీబీ డీజీలకు హైకోర్టు వెసులుబాటు కల్పించింది. చోరీ కేసు లోక్ అదాలత్ వద్ద రాజీ వ్యవహారంతో పాటు నిందితుడు రవికుమార్ ఆస్తులపై దర్యాప్తు కొనసాగించాలని సీఐడీ, ఏసీబీ డీజీలకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసేందుకు సేకరించిన సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని సీఐడీ, ఏసీబీ డీజీలకు సూచించింది. టీటీడీ అప్పటి ఏవీఎస్వో వై. సతీష్ కుమార్ పోస్టుమార్టం సర్టిఫికేట్‌ను సీల్డ్ కవర్లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందజేయాలని సీఐడీని ఆదేశించింది. కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన సమాచారాన్ని అవసరమైన మేరకు ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో పంచుకోవాలని స్పష్టీకరించింది. సీఐడీ, ఏసీబీ డీజీలు దాఖలు చేసిన నివేదికలను పరిశీలించిన అనంతరం హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను హైకోర్టు ధర్మాసనం ఈనెల 16కు వాయిదా వేసింది.

# ఎన్నికల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు: ఎస్పీ స్నేహ



వికారాబాద్, డిసెంబర్,10(సమయం న్యూస్): జిల్లాలో జరగబోయే మొదటి దశ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలను పర్యవేక్షించడానికి మరియు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడడానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పౌరులందరూ ఎటువంటి భయం లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో రౌడీ షీటర్లు, సస్పెక్ట్‌లు, మరియు ట్రబుల్ మంగర్‌లందరినీ ఇప్పటికే బైండోవర్ చేయడం జరిగింది. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, లైసెన్స్ పొందిన తుపాకులు, ఇతర ఆయుధాలను పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేసుకునే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులకు, ప్రభుత్వ ఆస్తులకు, లేదా సాధారణ ప్రజలకు ఎవరైనా ఇబ్బందులు కలిగించినా, భయభ్రాంతులకు గురిచేసినా, చట్టప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. అంతేకాకుండా, ఎన్నికలలో అలజడులు సృష్టించాలనే ప్రయత్నం చేసినా, సామాజిక మాధ్యమాలలో తప్పుడు లేదా విద్వేషపూరిత ప్రచారాలు చేసినా,అటువంటి వారిపై కేసులు నమోదు చేసి, అవసరమైతే షీట్ కూడా ప్రారంభించడం జరుగుతుందని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని, పోలింగ్ బూత్‌లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్‌లు, కెమెరాలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లడం లేదా వాటితో ఫోటోలు,వీడియోలు చిత్రీకరించడం పూర్తిగా నిషేధం అని తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కూడా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఎటువంటి అనుమానాలు, ఇబ్బందులు లేకుండా ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పోలీస్ అధికారులకు సంపూర్ణంగా సహకరించాలని ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపినారు. ఎక్కడైనా అలజడులు లేదా అవాంఛనీయ సంఘటనలు సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు గమనిస్తే, వెంటనే తమ పరిధిలోని పోలీస్ అధికారులకు లేదా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని ఎస్పీ కోరారు.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్



మద్దూరు/కోస్గి, డిసెంబర్ 10 (సమయం న్యూస్): నారాయణపేట జిల్లాలో గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం సందర్శించారు. ముందుగా మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవం-ణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 11 జిల్లాలోని మద్దూరు, కొత్తపల్లి, గుండుమాల్, కోస్గి మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ అవసరమైన సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో తీసుకున్న సిబ్బంది ఒకటికి రెండుసార్లు సామాగ్రిని సరి చూసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు, బాక్సులు చెక్ చేసి ప్యాక్ చేసుకోవాలని, పోటీ చేసే అభ్యర్థుల కు సమానంగా గుర్తులు ఉన్నాయా లేదా నిశితంగా పరిశీలించాలన్నారు. అనంతరం కలెక్టర్ కోస్గి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో గల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్‌క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్లు వెంట అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, శ్రీను కొత్తపల్లి, గుండుమల్ మండల కేంద్రాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరు తెన్నులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, డిఆర్డిఓ మొగులప్ప, ఆయా మండల ల తహసిల్దారులు, ఎంపీడీవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో తాత్కాలిక ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మం, డిసెంబర్ 10 (సమయం న్యూస్):ఈ నెల డిసెంబర్ 20వ తేదీలోపు ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో తాత్కాలిక పద్ధతిన పనిచేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న పిల్లలపై జరిగే అఘాయిత్యాలు, పోక్సో కేసులను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో మార్చి 2026 వరకు తాత్కాలిక పద్ధతిన పనిచేయడానికి సీనియర్ అసిస్టెంట్ మరియు ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ పోస్టుకు నెలకు రూ22,750, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు నెలకు రూ.15,600/ వేతనం అందించడం జరుగుతుందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు దరఖాస్తు చేసుకునే పక్షంలో వారికి 65 సంవత్సరాలు నిండి ఉండటానికి వీలు లేదు, అలాగే తెలంగాణ మినిస్టీరియల్ సర్వీసులలో పదవీ విరమణ పొందిన వారికి మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హత ఉంటుందన్నారు. రిటైర్మెంట్ పొందిన జ్యుడీషియల్ సిబ్బంది దరఖాస్తు చేసుకోని పక్షంలో జనరల్ అభ్యర్థులకు అవకాశం లభిస్తుందని, వీరికి వయసు 18 నుంచి 34 లోపు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు వయసు సడలింపు ఉంటుందని అన్నారు. సీనియర్ అసిస్టెంట్ పోస్ట్‌కు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి. ఆఫీస్ సబార్డినేట్ పోస్ట్‌కు 7 నుంచి 10వ తరగతి వరకు ఏదైనా ఒకటి చదివి ఉండాలని, 10 కంటే ఎక్కువ చదివిన వారిని ఎంపిక చేయరని ఆయన తెలిపారు. బయట వారి నుంచి 20 కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే, మెరిట్ ప్రకారం వారిని షార్ట్ లిస్ట్ చేసి, రాత పరీక్ష లేదా ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు డిసెంబర్ 20వ తేదీ సాయంత్రం 5:00 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

# సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేసుకోవాలి

● ఎస్పీ రోహిత్ రాజు



కొత్తగూడెం, డిసెంబర్ 10 (సమయం న్యూస్): జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం నాడు ఎస్పీ కార్యాలయంలో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక వ్యక్తులను గుర్తించి, వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సబ్ డివిజన్‌లోని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పంచాయతీల వారీగా ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు విధులను నిర్వర్తించే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయాలని ఎస్పీ రోహిత్ రాజు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, 2టౌన్ సీఐ ప్రతాప్, జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు రమణా రెడ్డి, రవి, రమాదేవి, జయసింహారెడ్డి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య



సంగారెడ్డి, డిసెంబర్ 10 (సమయం న్యూస్): గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య బుధవారం నాడు సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ హత్నూర మండలం కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో, అలాగే సంగారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు వంటి అన్ని సౌకర్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్‌ఓలకు (రిటర్నింగ్ ఆఫీసర్లు) సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరగాలి

## చెక్ లిస్ట్ చూసుకోవాలి: కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి, డిసెంబర్ 10 (సమయం న్యూస్): గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ బుధవారం నాడు పరిశీలించారు. రాజంపేట్, దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఆయన సందర్శించారు.

### పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారి అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎన్నికల సామాగ్రి, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను ఆయన పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారీగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని అధికారులకు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకున్న తర్వాత ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు.

### సిబ్బందికి సౌకర్యాలు

పోలింగ్ సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, అడ్డంకిలేకుండా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులకు సూచించారు.

# పంచాయతీ ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కొత్తపల్లి/ కరీంనగర్ రూరల్ డిసెంబర్10( సమయం న్యూస్): మొదటి విడతలో గురువారం నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సప్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు-2025లో భాగంగా కరీంనగర్ జిల్లాలో మొదటి విడత పోలింగ్ జరగనున్న కరీంనగర్ రూరల్ మండలం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అదేవిధంగా కొత్తపల్లి మండలానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను, ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఓటు హక్కు వినియోగానికి 18 రకాల గుర్తింపు కార్డులు

**కలెక్టర్ సిక్తా పట్నాయక్ వెల్లడి**



**నారాయణపేట, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

నారాయణపేట జిల్లాలో ఈ నెల 11, 14, 17 తేదీలలో మూడు విడతలుగా జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఎన్నికల సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు, నిర్దేశిత 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒక దానిని తప్పనిసరిగా తమ వెంట తీసుకురావాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లు తమ గుర్తింపు కోసం ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫోటోతో కూడిన పోస్ట్ ఆఫీస్ లేదా బ్యాంక్ పాస్ బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ లేదా పాన్ కార్డును చూపించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. వీటితో పాటు ఫోటోతో కూడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల ధృవీకరణ పత్రాలు, ఇండియన్ పాస్పోర్ట్, ఫోటో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు కూడా చెల్లుబాటు అవుతాయని తెలిపారు. అలాగే దివ్యాంగుల గుర్తింపు కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, రేషన్ కార్డు, ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్స్ పత్రం, ఫ్రీడం ఫైటర్ ఐడీ కార్డు లేదా ఆర్జీఐ ద్వారా జారీ చేయబడిన ఎన్.పీ.ఆర్ స్మార్ట్ కార్డులలో ఏదో ఒక దానిని పోలింగ్ అధికారులకు చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు.

# వివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దాం

**జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్**

**నారాయణపేటలో ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం**

**చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచన**



**నారాయణపేట, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

జాతి, మత, లింగ, రాజకీయ కారణాలతో ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదని, మానవ హక్కులను పరిరక్షిస్తూ వివక్ష లేని సమాజాన్ని నిర్మించుకుందామని నారాయణపేట ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ బి. సాయి మనోజ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నారాయణపేట టౌన్‌లోని మార్కండేయ దేవాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి సాయి మనోజ్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పౌర, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులపై అవగాహన కల్పించేందుకే ఏటా డిసెంబర్ 10న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.

మానవ హక్కుల ప్రధాన లక్ష్యం కుల, మత, వర్ణ, లింగ వివక్ష లేని జీవనం గడపడమేనని ఆయన స్పష్టం చేశారు. చిత్రహింసలు, క్రూరత్వం, వెట్టిచాకిరీ, బానిసత్వం వంటి దురాచారాల నుంచి రక్షణ పొందడం, నిర్బంధం లేని జీవన విధానం, స్వేచ్ఛగా స్వదేశం, విదేశాల్లో పర్యటించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని గుర్తుచేశారు. నిరంకుశత్వానికి, అణచివేతకు వ్యతిరేకంగా మనుషులు తిరుగుబాటును ఆశ్రయించకుండా ఉండాలంటే, చట్టబద్ధ పాలన ద్వారా మానవ హక్కులను రక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భావప్రకటనా స్వేచ్ఛ, విశ్వాసాల విషయంలో స్వేచ్ఛ, భయం, లేమి నుంచి విముక్తి ఉన్న ప్రపంచాన్ని ఆవిష్కరించుకోవడం అందరి ఆకాంక్ష అని అన్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తి సూచించారు. ఈ సందర్భంగా పిల్లల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం అనైతిక ట్రాఫిక్ నివారణ చట్టం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే పిల్లలకు పెళ్లిళ్లు చేస్తే తల్లిదండ్రులదే బాధ్యత అని హెచ్చరించారు. అలాగే వరకట్న వేధింపులు, మహిళా రక్షణ కోసం సఖి సెంటర్లు, వయోవృద్ధుల కోసం ఉన్న చట్టాలు, ఓల్డేజ్ హోమ్స్, సామాన్య ప్రజలు ఉచిత న్యాయ సేవలు పొందే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్, పారా లీగల్ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేషనల్స్ కు ఎంపికైన పరిగి యువ క్రికెటర్ సాయి రిత్విక్

**మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ ఘన సన్మానం**

**పరిగి, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేదికగా ఇటీవల జరిగిన 69వ ఎస్జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) అండర్-14 క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పరిగికి చెందిన యువ క్రికెటర్ సాయి రిత్విక్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. తన ఆటతీరుతో ఆకట్టుకున్న రిత్విక్ జాతీయ స్థాయి పోటీలకు (నేషనల్స్) ఎంపికై సత్తా చాటాడు. వికారాబాద్ జిల్లా నుంచి ఈ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిగా రిత్విక్ గుర్తింపు పొందడం విశేషం. ఈ ఘనత సాధించిన సాయి రిత్విక్‌ను పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ బుధవారం తన నివాసంలో శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. పరిగి పట్టణానికి చెందిన కానిస్టేబుల్ రవికుమార్, ఉపాధ్యాయురాలు సాహితీ దంపతుల కుమారుడైన రిత్విక్ చిన్ననాటి నుంచే క్రికెట్‌పై మక్కువ పెంచుకుని రాణిస్తున్నాడు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి మాట్లాడుతూ, పరిగి నుంచి ఒక క్రీడాకారుడు జాతీయ స్థాయికి ఎంపిక కావడం నియోజకవర్గానికే గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో రిత్విక్ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి దేశానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. అలాగే రిత్విక్‌ను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, మురళీకృష్ణలను కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు ఆర్. ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జాక్ రవికుమార్ తదితరులు పాల్గొని రిత్విక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# పెట్రోల్ బంకుల్లో వసతులు కల్పించాలి

- **జిల్లా పౌరసరఫరాల అధికారి పి నిత్యానందం**





**మెదక్ డిసెంబర్10( సమయం న్యూస్):** ప్రజలకు పెట్రోల్ బంకుల్లో మౌలిక వసతులు కల్పించాలని పౌరసరఫరాల అధికారి పీ నిత్యానందం బంకు నిర్వాహకులకు సూచించారు. బుధవారం మెదక్ పట్టణంలోని శ్రీనివాస పెట్రోల్ బంక్ నుఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా ఇంధన కొలతలు, నాణ్యత, ధరల ప్రదర్శన, భద్రతా ప్రమాణాలు, వినియోగదారులకు కల్పించాల్సిన కనీస మౌలిక వసతులను పరిశీలించారు. తనిఖీలో ఇంధన కొలతల్లో తేడాలు, ఫిల్టర్ పేపర్ టెస్ట్‌లో అనుమానాస్పద ఫలితాలు, తాగునీరు-టాయిలెట్స్%-%ఫస్ట్ ఎయిడ్, టైర్లకు ఉచిత గాలి వంటి సదుపాయాల లేమి వంటి పలు లోపాలు బయటపడ్డాయి. చట్టప్రకారం పెట్రోల్ బంకుల్లో ఈ సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసిన అధికారి, వినియోగదారులను మోసం చేసే విధంగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరపరాల అధికారి నిత్యానందం మాట్లాడుతూ, "ఇంధనాన్ని ఖచ్చితమైన కొలతలతో, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా విక్రయించడం బంక్ నిర్వాహకుల చట్టబద్ధ బాధ్యత అని అన్నారు. వినియోగదారుల హక్కులను ఉల్లంఘించే ఏ అక్రమానికీ ప్రభుత్వం సహనం వహించదు" అని హెచ్చరించారు. బంక్‌పై ప్రాథమిక కేసు నమోదు చేసి, సంబంధిత చట్టాల కింద వివరణ కోరినట్లు, అవసరమైతే బంక్‌ను సీజ్ చేయడం సహా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వాహనదారులకు ఇంధన నాణ్యత, కొలతపై సంబంధించిన అనుమానాలు ఉన్నప్పుడు బంకులో ఉండే కొలత-క్వాలిటీ చెక్ సామగ్రి చూపించాలని డిమాండ్ చేయొచ్చని, అలాంటి సహకారం అందించనపక్షంలో వెంటనే పౌరసరఫరాల/లీగల్ మెట్రాలజీ శాఖకు ఫిర్యాదు చేయాలని అధికారి సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే బంకులపై ఎటువంటి కనికరం చూపబోమని స్పష్టం చేశారు.

# ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

**ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం - అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు**

**ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట/కొడంగల్, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

నారాయణపేట జిల్లాలో జరగనున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మద్దూరు, కొత్తపల్లి, కోస్గి, గుండుమాల్ మండలాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు వచ్చిన పోలీసు అధికారులకు, సిబ్బందికి మద్దూరులోని షా గార్డెన్ ఫంక్షన్ హాల్, కోస్గిలోని పంచాక్షరి ఫంక్షన్ హాల్‌లలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎస్పీ భద్రతాపరమైన దిశానిర్దేశం చేశారు. ఈ నాలుగు మండలాల పరిధిలో మొత్తం 650 మంది సివిల్ పోలీస్ ఫోర్స్, రెండు టీఎస్ఎస్పీ బెటాలియన్లు, సీఐడీ బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

జిల్లాలోని ఈ నాలుగు మండలాల్లో మొత్తం 67 గ్రామ పంచాయతీలు ఉండగా, అందులో 12 ఏకగ్రీవం అయ్యాయని, మిగిలిన 55 పంచాయతీలకు పోలింగ్ జరుగుతోందని ఎస్పీ వివరించారు. వీటిలో 13 సమస్యాత్మక గ్రామ పంచాయతీలు, 27 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అక్కడ అదనపు బలగాలతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని తెలిపారు. మద్దూరు, కొత్తపల్లి మండలాలను 18 రూట్లుగా, కోస్గి, గుండుమాల్ మండలాలను 15 రూట్లుగా విభజించి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రూట్ మొబైల్ ఆఫీసర్లు నిరంతరం గస్తీ తిరుగుతూ, గ్రామాల్లో గుంపులుగా ఉండకుండా చూడాలని, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, డబ్బు పంపిణీ జరగకుండా, రాజకీయ ప్రచారాలు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.




# డిసెంబర్ 20లోగా ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి

**జీహెచ్ఎంసీ**

**పెనాల్టీ లేకుండా గడువు వినియోగించుకోవాలని సూచన**

**హైదరాబాద్, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వ్యాపార సంస్థల నిర్వాహకులు 2026 సంవత్సరానికి సంబంధించిన ట్రేడ్ లైసెన్సులను డిసెంబర్ 20, 2025 లోపు రెన్యువల్ చేసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులు కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, నిర్ణయించిన ఈ గడువు లోపు రెన్యువల్ చేసుకుంటే ఎటువంటి పెనాల్టీ (అపరాధ రుసుము) ఉండదని స్పష్టం చేశారు. వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం పెనాల్టీ వివరాలను కూడా అధికారులు వెల్లడించారు. డిసెంబర్ 20, 2025 వరకు ఎలాంటి పెనాల్టీ ఉండదు. అయితే, గడువు ముగిసిన తర్వాత అంటే డిసెంబర్ 21, 2025 నుంచి ఫిబ్రవరి 19, 2026 మధ్య రెన్యువల్ చేసుకుంటే 25 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఫిబ్రవరి 20, 2026 ఆ తర్వాత రెన్యువల్ చేసుకుంటే 50 శాతం పెనాల్టీ విధిస్తారని తెలిపారు. పెనాల్టీ లేకుండా రెన్యువల్ చేసుకునేందుకు చివరి తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో, చివరి నిమిషంలో రద్దీని, భారీ జరిమానాలను తప్పించుకోవడానికి వ్యాపారులు ముందుగానే తమ లైసెన్సుల రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జీహెచ్ఎంసీ విజ్ఞప్తి చేసింది.

# భద్రకాళి బండ్ పనులను త్వరగా పూర్తి చేయండి

**మేయర్ గుండు సుధారాణి**

**కమిషనర్‌తో కలిసి అభివృద్ధి పనుల పరిశీలన**



**వరంగల్, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

వరంగల్ నగరంలోని చారిత్రక భద్రకాళి బండ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి బండ్ పై తుది దశకు చేరుకున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న మేయర్, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, భద్రకాళి బండ్‌పై చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికే చివరి దశలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన పనులను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఈఈలు రవికుమార్, మాధవిలత, ఏఈ సంతోష్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మొదటి దశ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం, డిసెంబర్ 9 (సమయం న్యూస్):**



ఖమ్మం జిల్లాలో జరగనున్న మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎన్నికల వివరాలను వెల్లడించారు. డిసెంబర్ 11న జిల్లాలోని 7 మండలాల పరిధిలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 192 గ్రామ పంచాయతీలకు గాను 20 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 172 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ స్థానాల కోసం 488 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే మొత్తం 1740 వార్డులకు గాను 2 వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదని, 323 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన 1415 వార్డులకు గాను 3424 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ మరియు కౌంటింగ్ ఒకే రోజు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం మధ్యాహ్నం 2 గంటల తర్వాత అక్కడే ఓట్ల లెక్కింపు చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 2,41,137 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1,16,384 మంది పురుషులు, 1,24,743 మంది మహిళలు, 10 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 2089 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయడంతో పాటు, 1899 మంది పోలింగ్ అధికారులు, 2321 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ మరియు సేకరణ కోసం 7 డిస్ట్రిబ్యూషన్, 7 రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలను కూడా కట్టుదిట్టం చేశారు. జిల్లాలో 36 సమస్యాత్మక పోలింగ్ లొకేషన్లను గుర్తించామని, 360 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయగా, 162 సున్నితమైన (సెన్సిటివ్) కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరిగేలా చూసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలు తమ సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం

## ప్రిసైడింగ్ అధికారులను సస్పెండ్.. కలెక్టర్ ప్రతీక్ జైన్



**దౌల్తాబాద్, మండలం, డిసెంబర్,10(సమయం న్యూస్):** బుధవారం కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలానికి చెందిన గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులుగా నియమించడం జరిగింది. వీరు విధుల్లో బాధ్యతారహితంగా నిర్లక్ష్యం వహించి విధులకు గైర్హాజరు అయినందున జిల్లా కలెక్టర్ వీరిని విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. 1. వంగరి అఖిల్ 2.తన్వీర్ ఫాతిమా 3.రాజశేఖర్ 4. నాటికరూ నీలప్ప 5.తలారి పద్మమ్మ 6. కే .మౌనిక 7.విజయలక్ష్మి 8. కాల్ కొండి గోపి సాయి 9. పానుగంటి శారద 10.ఎండి ఆయుబ్ పాష 11. సిందే శ్రీనివాస రమేష్ 12. ఎక్కేల్లి భీమయ్య 13. సబీహ సుల్తానా 14 ఇస్రా జాబిన్ లను ఎన్నికల విదులకు గైరహాజరు అయినందున వీరిని విధుల నుండి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారి చేసారు.

# గండీడ్ జోనల్ అధికారికి షోకాజ్

**మహబూబ్ నగర్ డిసెంబర్10( సమయం న్యూస్) :** మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన గండీడ్ మండలం లో జోనల్ అధికారికి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ విజయేందిర బోయి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గండీడ్ మండలం లో విశ్వ భారతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను కలెక్టర్ సందర్శించి పోలింగ్ బృందాలకు సామాగ్రి పంపిణీ పర్యవేక్షించారు. కలెక్టర్ ఉదయం 10.30. గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను కలెక్టర్ సందర్శించిన సమయంలో జోనల్ అధికారిగా నియమించిన పంచాయతీ రాజ్, ఏ. ఈ గండీడ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు రాక పోవడం, విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం కారణంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఎన్నికల విధుల్లో నియమించిన అధికారులు,సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

# చట్టాలపై అవగాహన సదస్సు


**కరీంనగర్ డిసెంబర్10 ( సమయం న్యూస్):** మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ గారి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల (కుమార్ వాడి) లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ మాట్లాడుతూ ప్రతి మనిషికి రాజ్యాంగము హక్కులను ప్రసాదించిందని ఇలాంటి హక్కులను కాపాడుకోవడానికి చట్టాలు చేయబడ్డాయని కావున ప్రతి విద్యార్థి తన యొక్క హక్కులను కాపాడుకోవడం కోసం చట్టాలపై అవగాహన పెంచుకోవలసిన బాధ్యత ఉందని తెలిపారు,కష్టపడి చదువుకొని వివిధ రంగాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించి ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన తల్లిదండ్రులకు గాని ఉపాధ్యాయులకు గాని తెలియజేయాలని కోరారు, ఎటువంటి చట్టపరమైన సమస్య అయినా 15100 కు కాల్ చేసి న్యాయపరమైన సలహా పొందవచ్చు అని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ గారితో పాటు, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

# పోలింగ్ సిబ్బందిని నది దాటించే ఏర్పాట్ల పరిశీలన



**పెంబి, డిసెంబర్ 10 (సమయం న్యూస్):** గ్రామపంచాయతీ ఎన్నికల తొలి దశ పోలింగ్ సందర్భంగా నిర్మల్ జిల్లా జనరల్ అబ్జర్వర్ ఐయేష మస్రత్ ఖానం మంగళవారం నాడు పెంబి మండలంలోని యాపాలగూడ గ్రామపంచాయతీని సందర్శించారు. ముఖ్యంగా, పోలింగ్ సిబ్బంది నదిని దాటి పోలింగ్ స్టేషన్లకు చేరుకునే ప్రాంతాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. యాపాలగూడలో పోలింగ్ బూత్‌కి చేరుకునే మార్గంలో వాగు అడ్డంగా ఉండడంతో, స్థానికంగా తయారు చేసిన థర్మాకోల్ పడవను ఉపయోగించి సిబ్బందిని సురక్షితంగా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు అబ్జర్వర్‌కు తెలిపారు. ఈ ఏర్పాట్లను అబ్జర్వర్ సమగ్రంగా పరిశీలించారు. సిబ్బంది ప్రయాణం ఎటువంటి ప్రమాదం లేకుండా జరగాలన్న దిశగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. డిసెంబర్ 11 మొదటి విడత పోలింగ్ జరగనున్న నేపథ్యంలో, సిబ్బందికి రవాణా, భద్రత, కమ్యూనికేషన్ వంటి అన్ని ఏర్పాట్లు ఖచ్చితంగా సిద్ధంగా ఉండాలని ఆమె స్థానిక ఎన్నికల నిర్వాహకులకు ఆదేశించారు. నదిని దాటే ప్రాంతంలో తగినంత సిబ్బంది, లైఫ్ జాకెట్లు, సపోర్ట్ రోప్స్ వంటి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ఎటువంటి ఇబ్బంది లేకుండా బూత్‌లకు చేరుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అబ్జర్వర్ స్పష్టం చేశారు.

# సమస్యాత్మ పోలింగ్ స్టేషన్‌లో వెబ్ కాస్టింగ్



**అదిలాబాద్ డిసెంబర్ 10 (సమయం న్యూస్):** సమస్యాత్మక ప్రాంతాల్లో వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుం దని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి విడత గ్రామపంచాయితీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. పౌరులందరూ ఓటు హక్కు వినియోగించాలని, తమ వెంట 18 ఫోటో గుర్తింపు పత్రాల్లో ఏదైన ఒకటి వెంట తీసుకెళ్లాలనీ తెలిపారు. జిల్లాలోని 21 సమస్యాత్మక ప్రాంతాల్లోనీ 46 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ పరిశీలనలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పరిగి యువ క్రికెటర్ సాయి రిత్విక్ నేషనల్స్‌కు ఎంపిక

## మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి సన్మానం




**పరిగి మున్సిపల్, డిసెంబర్ 10 (సమయం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతవారం నిర్వహించిన 69వ ఎస్జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) అండర్-14 క్రికెట్ స్టేట్ మీట్‌లో పరిగి యువ క్రికెటర్ సాయి రిత్విక్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి నేషనల్స్‌కు ఎంపికయ్యాడు. వికారాబాద్ జిల్లా నుంచి మొట్టమొదటిసారిగా నేషనల్స్‌లో పాల్గొనబోతున్న ఈ క్రీడాకారుడిని బుధవారం నాడు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తన నివాసంలో ఘనంగా సన్మానించారు. సాయి రిత్విక్ పరిగి పట్టణానికి చెందిన కానిస్టేబుల్ రవికుమార్, ఉపాధ్యాయురాలు సాహితీ దంపతుల కుమారుడు. బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకున్న రిత్విక్, రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో తన ప్రతిభను నిరూపించుకుని నేరుగా జాతీయ స్థాయికి దూసుకెళ్లడం విశేషం. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ, "పరిగి నుంచి జాతీయ స్థాయికి చేరుకోవడం అభినందనీయం. రాబోయే రోజుల్లో రిత్విక్‌కు ఇంకా ఉన్నత స్థాయి క్రీడాకారుడిగా ఎదిగే అవకాశాలు పెద్దవిగా ఉన్నాయి" అని పేర్కొన్నారు. రిత్విక్‌ను ప్రోత్సహించి తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, మురళీకృష్ణలను కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మండల పార్టీ అధ్యక్షులు ఆర్. ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జాక్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్‌హోకోయ శ్రీ హర్ష



**మంథని, డిసెంబర్-10:( సమయం న్యూస్):** పంచాయతీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం ఎన్నికల సిబ్బంది తమ విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌హోకోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్‌హోకోయ శ్రీ హర్ష మొదటి విడత పోలింగ్ జరిగేహో మంథని, ముత్తారం, రామగిరి, కమానపూర్, కాల్వ శ్రీరాంపూర్, మండలాల లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,హమొదటి విడత పంచాయతీ ఎన్నికలు డిసెంబర్ 11 న జరుగుతున్నాయని, ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమాల్లో చెప్పిన విధంగా నిబంధనలు పాటిస్తూ తమ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని, ఎక్కడ ఎటువంటి అలసత్వం జరగడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తూ విధులు నిర్వహించ కూడదని,ఎక్కడ ఎటువంటి వివాదాలు లేకుండా సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాలని,ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ అన్నారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని తెలిపారు. ఎన్నికల విధిని నిర్వహించే సిబ్బందికి గ్రామ పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఓ లు అవసరమైన తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, ఎలక్ట్రిసిటీ, వాహనాలు ఇతర అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం మంథని పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఖఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఏసిపి రమేష్, జడ్పీ సీఈవో నరేందర్, ఆర్డీవోలు గంగయ్య,సురేష్ ,ఎంపీడీవో లు, ఎం.పి.ఓ.లు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్విభజన అస్తవ్యస్తం

**మల్కాజిగిరి డిసెంబర్ 10 (సమయం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్విభజన అస్తవ్యస్తంగా ఉందని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఆరోపించారు. మల్కాజిగిరి సర్కిల్‌లో వార్డుల పునర్విభజన పూర్తిగా గందరగోళంగా ఉందని ఆయన బుధవారం విమర్శించారు. కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ, మల్కాజిగిరి సర్కిల్‌ను దాదాపు 12 వార్డులుగా విభజించాల్సింది పోయి, చివరి నిమిషంలో కేవలం 10 వార్డులకు మాత్రమే కుదించడం జరిగిందని అన్నారు. దీని కారణంగా మల్కాజిగిరి డివిజన్‌ను దాదాపు మూడు ముక్కలుగా చీల్చడం జరిగిందని, అయితే ఈస్ట్ ఆనందబాగ్, మౌలాలి డివిజన్లను మాత్రం యథావిధిగా ఉంచారని తెలిపారు. పునర్విభజనకు సంబంధించి విడుదల చేసిన గెజిట్‌లో వార్డుల పరిధులు (బౌండరీస్) స్పష్టంగా లేవని ఆయన అన్నారు. ఉదాహరణకు, ఆర్.కె.నగర్ బ్రిడ్జిని అర్కేపురం బ్రిడ్జిగా సంబోధించడం జరిగిందని, అదేవిధంగా లోవర్ సఫిల్గుడా ట్రాక్ అంటే ఏమిటో ఎవరికీ అర్థం కాలేదని విమర్శించారు. చాణక్యపురి కాలనీ ఏ వార్డులోకి వస్తుందో కూడా స్పష్టంగా తెలియడం లేదని, ఏ డివిజన్‌లో ఎంత జనాభా ఉందో కూడా తెలియకుండా ఈ ప్రక్రియ పూర్తి చేశారని ఆయన ఆరోపించారు. 'ఇది రాజకీయ పునర్విభజన' అని ఆరోపిస్తూ, మల్కాజ్గిరిలో ఉన్న ఓటర్లను కావాలనే విడగొట్టే ప్రయత్నం చేశారని కార్పొరేటర్ శ్రవణ్ పేర్కొన్నారు. పునర్విభజన చేసేటప్పుడు ముఖ్యమైన స్థలాలను పాయింట్ల కింద పెట్టుకుని ఆ తదుపరి ప్రదేశాన్ని నాలుగు భాగాలుగా విభజించి ఉంటే బాగుండేదని, కానీ రైల్వే ట్రాక్‌ను బౌండరీగా తీసుకోవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించిన సాధారణ పరిశీలకురాలు కాత్యాయనీ దేవి

**మహబూబ్ నగర్, డిసెంబర్ 10 (సమయం న్యూస్):** మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, మహబూబ్ నగర్ జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకురాలు శ్రీమతి కాత్యాయనీ దేవి ఐ.ఎ.ఎస్. బుధవారం నాడు జిల్లాలోని రాజాపూర్ మరియు మహబూబ్ నగర్ రూరల్ మండలాల్లో పర్యటించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించారు. నేడు (డిసెంబర్ 11, 2025) గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలు రాజాపూర్, మహబూబ్ నగర్ రూరల్ మండలాలలో జరగనున్నాయి. ఈ సందర్భంగా, రాజాపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరియు మహబూబ్ నగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ తీరును ఆమె పర్యవేక్షించారు. ఎన్నికల ఏర్పాట్లు సక్రమంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని ఆమె అధికారులకు సూచించారు.



# సజావుగా ఎన్నికల నిర్వహణ

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగాం డిసెంబర్10 (సమయం న్యూస్):** రేపు జరిగే మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని ఎన్నికల అబ్జర్వర్ రవి కిరణ్,జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు చిల్పూర్, స్టేషన్ ఘనపూర్, లింగాల ఘనపూర్, జాఫర్ ఘడ్, రఘునాథ్ పల్లి మండలాల్లో... రేపు జరగనున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను అబ్సర్వర్ రవి కిరణ్,జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలక్షన్ మెటీరియల్ పంపిణి ని పరిశీలించారు ముందుగా ఘన్పూర్ లోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి... పోలింగ్ అధికారులకు ఇచ్చిన మెటీరియల్ ని చెక్ చేశారు పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. మైక్రో అబ్సర్వర్ లతో మాట్లాడి పలు సూచనలు చేసారు అనంతరం చిల్పూర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వెళ్లి.. ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బా క్సులను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏ ర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజ నం కల్పించాలని.. విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు, వచ్చిపోయేదారులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు అనంతరం రఘునాథ్ పల్లి జడ్పీ సెకండరి స్కూల్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి... పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్సర్వర్ లతో మాట్లాడి రేపు వారి విధులను క్షుణ్ణం గా వివరించారు. పోలింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన భోజన సదుపాయాన్ని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్వయంగా పరిశీలించి.. పోలింగ్ సిబ్బంది కి వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు వెంకన్న, గోపిరాం, తహసీల్దార్ లు,ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు

# అల్విదా నవాబ్ భాయ్

## పేదల పక్షపాతిని, ప్రజా బాంధావుడిని కోల్పోయాం

- సమద్ నవాబ్ మరణం కాంగ్రెస్ కు తీరని లోటు
- అంత్యక్రియలకు హాజరైన రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్
- సమద్ నవాబ్ ను కడసారి చూపుకోసం వేలాదిగా తరలివచ్చిన జనం
- బైపాస్ రోడ్ ఖబ్రస్థాన్ లో జనాజా నమాజ్ ఆచరించి.. అంత్యక్రియలు పూర్తి





**కరీంనగర్, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఇదారా ఏ ఖాదిమానే మిల్లత్ సెక్రటరీ అబ్దుల్ సమద్ నవాబ్ ను కడసారి చూడటం కోసం కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి, కరీంనగర్ పట్టణం నుంచి పార్టీలకతీతంగా ముస్లింలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్, డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, ప్రతినిధులు, అభిమానులు, జమాత్ లకు అతీతంగా ఇస్లామీయ ధార్మిక పండితులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. హుస్సేనీ పుర నుంచి బైపాస్ రోడ్ వరకు జన ప్రవహంతో కిక్కిరిసి పోయింది. పెద్ద ఎత్తున వాహనాలు రావడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వేలాది మంది అశ్రునయనాల నడుమ కరీంనగర్ బైపాస్ రోడ్ లో సమద్ నవాబ్ పట్టుదలతో, కృషితో నిర్మించిన మస్జిద్ అఫ్జల్ బియాబాని లో వందలాదిమంది ముస్లింల సమక్షంలో ఇస్లామీయ సాంప్రదాయం ప్రకారం చివరగా నమాజే జనాజా ఆచరించి, సమద్ నవాబ్ కృషితో సాధించిన పక్కనే గల ఖబ్రస్తాన్ లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈఅంత్యక్రియల్లో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ లతో పాటు పలువురు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలు మాట్లాడుతూ పేద ముస్లింల పక్షపాతిని, ప్రజా బాంధవుడిని సమాజం కోల్పోయిందన్నారు. సమద్ నవాబ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలా మంది నాయకులు కేవలం తమ స్వార్థం కోసం జీవిస్తారని, ప్రజల క్షేమం కోసం, సమాజాన్ని ఉద్ధరించడం కోసం కొందరు నాయకులే పుడతారని, ప్రజాభిమానాన్ని సంపాదించి, పేదల అభిమానాన్ని చూరగొన్న నేతగా, సంఘ సంస్కర్తగా సమద్ నవాబ్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సమద్ నవాబ్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. సమద్ నవాబ్ మరణం తనను కలిచివేసిందని, ఆయన కుమారులను ఓదార్చారు. వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ తరఫున సంతాపం ప్రకటించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఇంటికి పిలిచి, బ్యాట్‌తో కొట్టి..

**సంగారెడ్డి జిల్లా బీరంగూడలో దారుణం**

**కూతురు ప్రేమపై విషం చిమ్మిన తల్లిదండ్రులు**

**యువకుడిని పిలిపించి దారుణంగా హత్య**





**సంగారెడ్డి, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

సంగారెడ్డి జిల్లా బీరంగూడలో దారుణం జరిగింది. కూతురును ప్రేమించాడని తెలిసి.. పెళ్లి గురించి మాట్లాడదామని అతడిని ఇంటికి పిలిపించి అమ్మాయి తల్లిదండ్రులు అతనిడిని దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇంజనీరింగ్ స్టూడెంట్ జ్యోతి శ్రావణ్ సాయిని హత్య చేసిన ఘటన అమీన్‌పూర్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో వెలుగులోకి వచ్చింది. జ్యోతి శ్రావణ్ సాయి(20), బీరంగూడ ఇసుకబావికి చెందిన శ్రీజ (19) గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉండడంతో అమ్మాయి తల్లిదండ్రులు తమ కూతురిని ప్రేమించొద్దని పలుమార్లు సాయిని హెచ్చరించారు. అయినప్పటికీ శ్రావణ్ సాయి, శ్రీజ తమ ప్రేమను కొనసాగించారు. ఈ విషయం శ్రీజ తల్లిదండ్రులకు తెలిసింది. సాయిపై పగ పెంచుకున్న శ్రీజ కుటుంబం ఇద్దరికీ మ్యారేజీ చేస్తామని, మాట్లాడుకుందా మని అతనిని ఇంటికి పిలిపించారు. ఇంటికి పిలిచి ఒక్కసారిగా సాయిపై దాడి చేశారు. విచక్షణా రహితంగా అతనిని కొట్టడంతో శ్రావణ్ సాయికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఇంట్లోకి లాక్కెళ్లి మరీ దాడి చేశారు. దెబ్బలకు తాళలేక విలవిలలాడిపోయిన శ్రావణ్ సాయి ప్రాణాలు కోల్పోయాడు. జ్యోతి శ్రావణ్ సాయి మైసమ్మ గూడలోబి సెయింట్ పీటర్ కాలేజీలో బీటెక్ సీఎస్ఈ సెకండియర్ చదువుతున్నాడు. కుత్బుల్లాపూర్‌లో రూం తీసుకుని జ్యోతి శ్రావణ్ సాయి ఉంటున్నాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్ చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమీన్ పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వీరిద్దరూ పదో తరగతి వరకూ కలిసి చదువుకోవడంతో సాన్నిహిత్యం ఏర్పడి.. ప్రేమకు దారితీసినట్టు తెలుస్తోంది. ఈ విషయం తెలిసి ఇరువురినీ పలుమార్లు హెచ్చరించారు శ్రీజ తల్లిదండ్రులు. అయినా వినిపించుకోకపోవడంతో ఆగ్రహించిన యువతి తల్లిదండ్రులు.. హతమార్చారు. ఈ ఘటనపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# సమ్మిట్‌తో ఊహించని పెట్టుబడులు

- పేరెన్నికగన్న కంపెనీలతో పలు ఒప్పందాలు
- ముందస్తు కార్యక్రమాలతోనే రాహుల్, ఖర్గేలు రాలేదు
- త్వరలోనే పార్టీ పదవుల భర్తీని పూర్తి చేస్తాం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని స్థాయిలో తెలంగాణకు పెట్టుబడులు వచ్చాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. పేరుగాంచిన కంపెనీలతోనే తమ ప్రభుత్వానికి ఒప్పందాలు జరిగాయని వివరించారు. ముందు కొన్ని కార్యక్రమాలు ఫిక్స్ కావడంతో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే ,రాహుల్ గాంధీ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రాలేకపోయారని తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ చేశారు.తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము తమకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. శ్వేతపత్రం అంటే బీఆర్ఎస్‌కు భయమని ఎద్దేవా చేశారు మహేశ్ కుమార్ గౌడ్. ఫ్యూచర్ సిటీ భవిష్యత్‌లో గొప్పగా ఉంటుందని తెలిపారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్‌లు భర్తీ చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. టీపీసీసీ నియామకం జరిగిన రోజే డీసీసీలతో మినహా అన్ని పోస్టులు రద్దు అవుతాయని తెలిపారు. ఈనెల చివరి నాటికి కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పుకొచ్చారు. లంబాడాలకు నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించామని తెలిపారు. ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ చూడలేక మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. లావాదేవీలలో భాగంగానే కవిత – బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కవిత కారణంగా బీఆర్ఎస్ కబ్జాలు అన్ని బయటకు వస్తున్నాయని విమర్శించారు. కవిత ఆరోపణలపై విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తాను టీపీసీసీగా చాలా సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆర్గనైజేషన్ అంటే తనకు ఇష్టమని చెప్పుకొచ్చారు. మీడియాలోనే తనకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తున్నారని చెబుతున్నారని.. అప్పుడే మంత్రి పదవి ఇస్తున్నారంటూ కూడా ఊహాగానాలు వస్తున్నాయని తెలిపారు. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చాలా బాగా మాట్లాడారని ప్రశంసించారు మహేశ్ కుమార్ గౌడ్. పశ్చిమ బెంగాల్ ఎలక్షన్ కోసం వందేమాతరాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జవాహర్ లాల్ నెహ్రూను విమర్శిస్తూ జీవితంలో అతిపెద్ద పొరపాటు చేశారని మండిపడ్డారు. నెహ్రూ వల్లే దేశం వెనకబడిందని బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లాలంటే బయపడ్డారని ఎద్దేవా చేశారు. 1965లో ఇందిరాగాంధీ ఆర్ట్స్ కాలేజీకి వచ్చారని... 60 సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ట్స్ కాలేజీకి వెళ్లడం చరిత్రగా నిలిచిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఆదిలాబాద్ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**ఆదిలాబాద్, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. జైనథ్ మండలం తరోడ సమీపంలో బుధవారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. మృతులను ఆదిలాబాద్‌లోని జైజవాన్ నగర్, లక్ష్మీనగర్ వాసులుగా గుర్తించారు. మహారాష్ట్రకు మేస్త్రీ పనికి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతదేహాలను జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు.

# ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా జడ్జి జి. రాజగోపాల్**




**ఖమ్మం, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

ఖమ్మం జిల్లాలోని ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో తాత్కాలిక పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నపిల్లలపై జరిగే అఘాయిత్యాలు, పోక్సో కేసుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఈ కోర్టులో, మార్చి 2026 వరకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయడానికి సీనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎంపికైన సీనియర్ అసిస్టెంట్‌కు నెలకు రూ. 22,750, ఆఫీస్ సబార్డినేట్‌కు రూ. 15,600 చొప్పున వేతనం చెల్లించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోస్టులకు ప్రధానంగా తెలంగాణ మినిస్టీరియల్ సర్వీసులలో పనిచేసి పదవీ విరమణ పొందిన జ్యుడిషియల్ ఉద్యోగులు అర్హులని, వారికి 65 ఏళ్ల వయసు నిండి ఉండకూడదని జడ్జి సూచించారు. ఒకవేళ రిటైర్డ్ ఉద్యోగులు దరఖాస్తు చేసుకోని పక్షంలో జనరల్ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామని, వారి వయసు 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల వయసు సడలింపు ఉంటుంది. విద్యార్హతల విషయానికి వస్తే, సీనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు 7వ తరగతి నుంచి 10వ తరగతి మధ్య అర్హత కలిగి ఉండాలని, 10వ తరగతి కంటే ఎక్కువ చదివిన వారిని ఎంపిక చేయరని స్పష్టం చేశారు. అలాగే సబార్డినేట్ పోస్టులకు డ్రైవింగ్, ఎలక్ట్రికల్ పని, ప్లంబింగ్, వంట వంటి పనుల్లో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తారు. జనరల్ అభ్యర్థుల నుంచి 20 కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే, మెరిట్ ఆధారంగా షార్ట్ లిస్ట్ చేసి రాత పరీక్ష లేదా ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు డిసెంబర్ 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను సమర్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ ఆ ప్రకటనలో కోరారు.

# సీఎం సహాయనిధిలో కొత్త రికార్డు

## రెండేళ్లలో రూ.1,685.79 కోట్ల సహాయం అందజేత




**హైదరాబాద్, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

తెలంగాణలో ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డు సృష్టించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎప్పుడూ లేని స్థాయిలో వైద్య సహాయం అందింది. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 డిసెంబర్ 6 వరకు మొత్తం 3,76,373 మంది లబ్దిదారులకు రూ.1,685.79 కోట్ల సహాయం అందజేశారు. గతంలో 2014 నుంచి 2024 వరకు సంవత్సరానికి సగటున రూ.450 కోట్లు మాత్రమే సహాయ నిధి ద్వారా పంపిణీ కాగా, ప్రస్తుత ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సగటున సంవత్సరానికి రూ.850 కోట్ల మేర నిధులు వెచ్చించడం గమనార్హం.ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రజలకు రెండు విధాలుగా వైద్య సహాయం అందుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స కోసం ముందుగానే ఖర్చు భరించే లెటర్ ఆఫ్ క్రెడిట్ విధానం ద్వారా 27,421 మంది లబ్దిదారులకు రూ.533.69 కోట్ల సహాయం అందింది. నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి వంటి వైద్య కేంద్రాల్లో ఈ సహాయం నేరుగా చికిత్స ఖర్చులకు ఉపయోగపడింది. మరోవైపు ప్రైవేటు లేదా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు ఖర్చులు చెల్లించిన అనంతరం తిరిగి పొందే రీయింబర్స్‌మెంట్ విధానం ద్వారా 3,48,952 మందికి రూ.1,152.10 కోట్లు అందజేశారు. ప్రజలు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్యం పొందేలా ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా నిమ్స్‌లో ఎక్కువగా లెటర్ ఆఫ్ క్రెడిట్ కేసులు మంజూరవడం ద్వారా పేదలకు అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చింది. ఈ మొత్తం పక్రియలో దళారీల పాత్ర లేకుండా దరఖాస్తులను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో స్వీకరిస్తున్నారు. ఆధార్ ధృవీకరణ తర్వాత లబ్దిదారుడి పేరు, బ్యాంక్ ఖాతా వివరాలతో చెక్కులు జారీ చేస్తుండటంతో పారదర్శకత మరింత పెరిగింది.తెలంగాణ రాష్ట్ర నివాసితులు, సాధారణంగా సంవత్సరానికి రూ.1.60 లక్షల లోపు కుటుంబ ఆదాయం ఉన్నవారు ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్హులు. ప్రజాప్రతినిధుల సిఫారసుతో అధికారిక అఓఖీఈ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అనారోగ్యం కారణంగా ఆర్థికంగా కుంగిపోయే కుటుంబాలకు పెద్ద భరోసాగా మారింది. గతంతో పోలిస్తే నాలుగింతల స్థాయిలో నిధులు వెచ్చించడం ద్వారా ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం కోసం ఎంత కీలకమో ఈ గణాంకాలే స్పష్టంగా చూపిస్తున్నాయి.

# ఈశ్వరచారిని పరామర్శించే తీరిక సీఎంకు లేదా?

**బీసీ జేఏసీ ఆగ్రహం**

**హైదరాబాద్, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బీసీల ఆకాంక్షలు నెరవేరాలని తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన తొలి బీసీ ఉద్యమ అమరవీరుడు సాయి ఈశ్వర చారి మరణించి ఐదు రోజులు గడిచినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గానీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గానీ ఆ కుటుంబాన్ని పరామర్శించకపోవడం అత్యంత బాధాకరమని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సాయి ఈశ్వర చారి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ గురువారం హైదరాబాద్‌లోని గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి తదితరులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, బీజేపీలు మోసం చేసినందుకే తాను ఆత్మహత్య చేసుకున్నట్లు ఈశ్వర చారి చెప్పారని గుర్తుచేశారు. బీసీలను మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బీసీ సమాజం క్షమించదని హెచ్చరించారు. ప్రస్తుతం ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతుంటే, అక్కడ పోరాడాల్సిన కాంగ్రెస్ వెనుకడుగు వేస్తోందని, మరోవైపు బీజేపీ రిజర్వేషన్ల చట్టాన్ని ఆమోదించకుండా జాప్యం చేస్తూ బీసీల బలిదానాలకు కారణమవుతోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు.

# స్కూల్ ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి

**కామారెడ్డి, డిసెంబర్ 10 (సమయం న్యూస్):**

స్కూల్ పిల్లలను తీసుకెళ్తున్న ఆటో బోల్తాపడి పదవ తరగతి విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో 14 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో ఈ ప్రమాదం జరిగింది. మండలంలోని సావర్గావ్ గ్రామం నుంచి ఖండే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తుండగా ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో పదవ తరగతి విద్యార్థి ప్రణవ్ (15) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో 14 మంది విద్యార్థులు గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాత్రుల్లో ప్రలోభాలకు ప్రయత్నాలు

- కవర్లలో నగదు, బాటిల్స్‌లో మద్యం!
- బెండారలో పట్టుబడ్డ అభ్యర్థి?
- పంచాయతీ ఎన్నికల ప్రలోభాలు!
- వాంకిడి మండలం బెండార గ్రామంలో ఘటన!
- పోలింగ్‌కు ముందు తీవ్ర కలకలం!



**ఆసిఫాబాద్ :** రాష్ట్రంలో గురువారం మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వెలుగు చూశాయి. ముఖ్యంగా వాంకిడి మండలంలోని పలు వార్డు అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు అక్రమ మార్గాలను ఎంచుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

### బెండార గ్రామంలో బట్టబయలు..!

వాంకిడి మండలంలోని బెండార గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలింగ్‌కు కేవలం కొన్ని గంటల సమయం మాత్రమే ఉండగా, బుధవారం రాత్రి వార్డు అభ్యర్థి తమ అనుచరులతో కలిసి ఓటర్లకు డబ్బు, మద్యం పంచుతూ రెడ్ హ్యాండెడ్‌గా పోలీసులకు పట్టుబడినట్లు సోషల్ మీడియాలో వీడియో వైరల్ అవుతుంది. గ్రామంలో అభ్యర్థులు ఓటర్లకు ప్రలోభాలు పంచుతున్నారనే పక్కా సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు, రాత్రిపూట దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అభ్యర్థులు వారి అనుచరుల వద్ద డబ్బు, మద్యం నిల్వలు లభించినట్లు తెలుస్తోంది.

### ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు..!

పంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో అభ్యర్థులు ఇలాంటి అక్రమాలకు పాల్పడడం తీవ్ర నేరంగా పరిగణించబడుతోంది. పట్టుబడిన వార్డు అభ్యర్థి, అనుచరులపై పోలీసులు ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కింద కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించినట్లు సమాచారం. ఎన్నికలకు ముందు రోజు రాత్రి ఈ ఘటన వెలుగుచూడటంతో జిల్లా రాజకీయాల్లో, ముఖ్యంగా వాంకిడి మండలంలో తీవ్ర కలకలం రేగింది. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని చూస్తున్న అధికారుల ప్రయత్నాలకు అడ్డు తగిలే విధంగా కొందరు అభ్యర్థులు వ్యవహరించడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### అధికారుల అప్రమత్తత అవసరం

ప్రలోభాలకు గురిచేసే అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు, ఎన్నికల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలి



**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్:** ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవా రం ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా సమీపంలోని ఉర్దూ భవన్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉర్దూ మీడి యం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉచిత టెట్ శిక్షణ కేంద్రాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలనే ఉ ద్దేశ్యంతో ఉచిత శిక్షణను అందిస్తున్నామని, పట్టణ కేంద్రంలో నిర్వహిస్తుండడంతో ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా అభ్యర్థులు టెట్ కోచింగ్ కు రావడం అభినందనీయమని, ప్రభుత్వ ఉద్యోగాలు ప్రతిఒక్కరికి రావని, కానీ శిక్షణతో ప్రైవేట్ రంగంలో సైతం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. నిత్యం తరగతులకు హాజరవుతూ వచ్చే డీఎస్సీలో అత్యధిక మంది ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఉర్దూ భవన్‌లో లైబ్రరీ ఏర్పాటుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు ఉర్దూ భవన్ లో ప్రత్యేక నిధులతో చేపట్టిన మరమ్మత్తులను మైనారిటీ సంక్షేమ అధికారి కలీం కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్య క్రమంలో జిల్లా యువజన క్రీడల సంక్షేమ అధికారి శ్రీని వాస్, అధికారులు, ట్రైనర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.





# ఎన్నికల నేపథ్యంలో బాంబు డిస్పోజల్ టీమ్ తనిఖీలు

**జైనూర్:** గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో బాంబు డిస్పోజల్ టీమ్ తనిఖీలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ నితిక పంత్ అన్నారు. భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి జిల్లా పరిధిలోని కెరమెరి, వాంకిడి, జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యు) మండలాల్లో జిల్లా పోలీస్ బాంబు డిస్పోజల్ టీమ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ముందు భద్రతా పరిస్థితిని సమగ్రంగా సమీక్షిస్తూ, పోలింగ్ కేంద్రాలు, రూట్ మ్యాపులు, ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, బస్ స్టాండ్లు, మార్కెట్ యార్డులు, గ్రామ ప్రవేశ ద్వారాల వద్ద తనిఖీలు జరిపినట్లు వివరించారు. బాంబు డిస్పోజల్ టీమ్ సిబ్బంది అనుమానాస్పద వస్తువులను గుర్తించే విధానం, భద్రతా ప్రోటోకాల్, అత్యవసర స్పందన చర్యలను సమీక్షించడం జరిగిందని, ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు అన్ని భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాంబుస్క్వాడ్, డాగ్ స్క్వాడ్, రిజర్వ్ పోలీస్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, రూట్ మొబైల్ టీమ్స్ నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడరాదని, జిల్లా పోలీసులు ఎన్నికల భద్రతాపై పూర్తి దృష్టి సారించినట్లు వివరించారు.





# పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**ఎంచికల్ పేట్:** ఈనెల 11, 12 తేదీల్లో జిల్లాలోని పెంచికల్ పేట్ మండలంలో జరిగే రెండొవ విడత ఎన్నికల్లో భాగంగా అధికారులు పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆల్బర్ట్ ఒక ప్రకట నలో తెలిపారు. అర్హత ఉన్న ప్రభు త్వ ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని పూర్తిగా వినియోగించుకుని తమ ఓటును నమోదు చేయాలని సూచించారు. దీనిని వినియోగించడానికి ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ కాపీ, ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు తీసుకొచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ విస్తృత ప్రచారం



**పెంచికల్‌పేట్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి జోరందుకుంది. ఈ క్రమంలో, పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి భక్తు సంతోష్ కు మద్దతుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'లేడీ పర్సు' గుర్తుకు ఓటేసి భక్తు సంతోష్ గారిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని, అధికార పార్టీని గెలిపిస్తేనే అభివృద్ధికి బాటలు వేయగలుగుతామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే, బెస్త మరియు మైనార్టీ కమ్యూనిటీల కోసం కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేస్తానని తెలిపారు. వీటికి తోడు, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని అన్నారు. సర్పంచ్ అభ్యర్థి గెలిచిన వెంటనే సుమారు కోటి రూపాయలతో ఎల్కపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని కూడా ఆయన హామీ ఇచ్చారు.



# అభివృద్ధికి సహకరించాలి

**గంభీరావుపేట:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గంభీరావుపేట సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వారు ఏ పార్టీకి చెందినవారైనా గెలుపొందిన అనంతరం గంభీరావుపేట అభివృద్ధికి సహకరించాలని గంభీరావుపేట గ్రామ సేవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లా డుతూ గంభీరావుపేట ప్రధాన రోడ్డు విస్తరణ చేపట్టి, స్థానిక గాంధీ నడిబొడ్డున ఉన్న మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామ ప్రజల తరుపున కోరారు. ఈ సమావేశంలో గ్రామ సేవ కమిటీ అధ్యక్షులు సిరిపురం రవి, ప్రధాన కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షులు కొత్తపల్లి చేపూరి ప్రభాకర్, కోశాధికారి రాగిశెట్టి నారాయణ, కార్యవర్గ సభ్యులు కోటలింగం, గంద్యడపు రాజు, జెల్ల బుదయ్య, శ్రీనివాసు, కృష్ణ, పార్థసారధి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి



**ఆదిలాబాద్:** అధికార పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ కోరారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం తలమడుగు మండలంలోని ఉండం, సాయి లింగి, కుచ్చులాపూర్ గ్రామాల్లో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, డీసీసీబీ అడ్డి భోజారెడ్డి, ఆడే గజేందర్, మాజీ జెడ్పీటీసీ గణేష్ రెడ్డి, బాబన్నలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల తప్పుడు మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన వచ్చాక రెండేళ్ల కాలంలోనే గ్రామాల్లో ఎంతో అభివృద్ధి జరిగిందని అన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజిలు, పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించామన్నారు. అధికార పార్టీ అభ్యర్థులు గెలిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలమడుగు, గుడిహత్నూర్ మండలాల అధ్యక్షులు కళ్యాణం రాజేశ్వర్, మల్యాల కరుణాకర్, ప్రకాష్ రావు, వెంకన్న, వివిధ మండలాల నాయకులు, సర్పంచ్ అభ్యర్థులు, వార్డ్ మెంబర్ల అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారంలో బోరంచు



**ఆదిలాబాద్:** ప్రజల మధ్య ఉంటూ సేవా చేసే ధర్మపురి చంద్రశేఖర్ ను మావల సర్పంచ్ గా భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఓటర్లను కోరారు. గ్రామపంచాయితీ సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మావల పంచాయి తీ పరిధిలో ప్రచారం చేపట్టా రు. అధికార పార్టీ బలపర్చిన మావల గ్రామపంచాయితీ సర్పంచ్ అభ్యర్థి ధర్మపురి చంద్రశేఖర్ కు మద్దతుగా ఇంటింటికీ తిరుగుతూ ఫుట్ బాల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యనే ఉండి సమస్యల పరిష్కారం కోసం పాటుపడిన శేఖర్ కు ఈసారి అవకాశం ఇవ్వాలన్నారు. అధికార పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుం దని పేర్కొన్నారు. వారి వెంట కాంగ్రెస్ శ్రేణులు ఉ న్నారు.

# ప్రతి పైసాకు లెక్క చూపాలి

**నేరడిగొండ:** సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ వేసిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఎన్నికల్లో చేసిన ప్రతి పైసాకు లెక్క చూపాలని ఎన్నికల నోడల్ అధికారి ఎంఎ కలీమ్, ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ జిల్లా అధికారి మోహన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థుల ప్రచార నిమిత్తం చేసే ఖర్చు, ఎన్నికల నియామాళి, నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిమిత్తం రోజువారి ప్రతి అభ్యర్థి చేసే ఖర్చులు రాసి లెక్క చూపెట్టాలని సూచించారు. 5వేల జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.2లక్షల 50వేలు వరకు, 5వేల లోపు జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.1లక్ష 50వేల వరకు ఖర్చు పెట్టవచ్చని తెలిపారు. ప్రచార సామాగ్రికి కోసం చేసే ఖర్చులు రోజు రాసిపెట్టాలని పేర్కొన్నారు. అభ్యర్థులు గెలిచినా, ఓడినా 45 రోజుల లోపు లెక్క చూపాలన్నారు. సర్పంచ్ అభ్యర్థులు ప్రచారం కోసం అనుమతి లేనిది వాహనాలు వాడరాదని తెలిపారు. డబ్బులు, లిక్కరు పంచడం చేసే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ మండల అధికారి రియాజోద్దీన్, ఎంపిడిఓ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధం

## నేడు న్యూ ఛండీగఢ్ వేదికగా రెండో టీ20



సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. న్యూ ఛండీగఢ్ వేదికగా గురువారం రాత్రి 7.30 గంటలకు ప్రారంభమయ్యే రెండో టీ20లో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. కటక్ వేదికగా జరిగిన తొలి టీ20లో టీమిండియా పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సత్తా చాటి 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండో టీ20లోనూ అదే జోరును కొనసాగించాలని టీమిండియా భావిస్తోంది. మరోవైపు చెత్త బ్యాటింగ్‌తో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న సౌతాఫ్రికా.. రెండో టీ20లోనైనా గట్టి పోటీనివ్వాలనే పట్టుదలతో ఉంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలి టీ20 విజయంతో టీమిండియా కాంబినేషన్‌లో మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బ్యాట్ ఝులిపించాల్సి ఉంది. గాయం నుంచి కోలుకొని బరిలోకి దిగిన శుభ్‌మన్ గిల్ తీవ్రంగా నిరాశపర్చాడు. వన్డే, టెస్ట్‌ల్లో సత్తా చాటుతున్న గిల్.. టీ20ల్లో మాత్రం ఆశించిన రీతిలో రాణించలేకపోతున్నాడు. తొలి మ్యాచ్‌లో 4 పరుగులే చేసి వెనుదిరిగాడు. రెండో టీ20లోనైనా అతను సత్తా చాటాలి. లేదంటే అతనిపై విమర్శలు ఎక్కువవుతాయి. ఫస్ట్ డౌన్‌లో ఆడిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా తీవ్రంగా నిరాశపర్చాడు. ఈ ఏడాది సూర్య ఒక్క మ్యాచ్‌లో కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. గత 15 ఇన్నింగ్స్‌ల్లో ఒక్క హాఫ్ సెంచరీ లేదు. కనీసం రెండో టీ20లోనైనా సూర్య సత్తా చాటాలి. తిలక్ వర్మ, అక్షర్ పటేల్, శివమ్ దూబేలు కూడా బ్యాట్ ఝులిపించాల్సి ఉంది. తొలి టీ20లో హార్దిక్ పాండ్యా మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. అతను అదే జోరు కొనసాగించాల్సి ఉంది. చివర్లో తనదైన శైలిలో ఫినిష్ ఇచ్చేందుకు జితేష్ సిద్ధంగా ఉన్నాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా వరుణ్ చక్రవర్తికి తిరుగులేదు. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లు కూడా సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలోనే తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం కనిపించడం లేదు. దాంతో హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌లకు మరోసారి నిరాశే ఎదురవ్వనుంది.

**భారత్ తుది జట్టు(అంచనా)**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ/సంజూ శాంసన్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్/అర్ష్‌దీప్ సింగ్

**భారత టీ20 టీమ్**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ,సంజూ శాంసన్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.



# రెండో స్థానానికి విరాట్ కోహ్లీ

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ విడుదల

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాజాగా రిలీజ్ చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రెండో స్థానానికి దూసుకెళ్లాడు. రీసెంట్‌గా సౌతాఫ్రికా సిరీస్‌లో సత్తా చాటడంతో విరాట్ రెండు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. ప్రస్తుతం అతడు 773 రేటింగ్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అగ్రస్థానం నిలబెట్టుకున్నాడు. అతడు 781 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. వన్డే ర్యాకింగ్స్‌లో టాప్ - 2 స్థానాల్లో టీమ్ఇండియా బ్యాటర్లే ఉండడం విశేషం.టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ఇచ్చేసిన భారత సీనియర్ బ్యాటర్లు కోహిత్, విరాట్ వన్డేల్లోనే కొనసాగుతున్నారు. 2027 వరల్డ్‌కప్‌లో ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ ఇద్దరు స్టార్లు ప్రస్తుతం అత్యుత్తమ ఫామ్ కనబరుస్తున్నారు. టీమ్ఇండియా ఆడిన గత రెండు సిరీస్‌ల్లో ఈ ఇద్దరే టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఆక్టోబర్‌లో ఆసీస్ సిరీస్‌లో రోహిత్ శర్మ, ఇటీవల ముగిసిన సౌతాఫ్రికా సిరీస్‌లో విరాట్ కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' లుగా నిలిచారు. దీంతో లేటెస్ట్ ర్యాంకింగ్స్‌లో టాప్ 2 స్థానాల్లో కొనసాగుతున్నారు.అక్టోబర్ నెలలో ఆసీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ ఆకట్టుకున్నాడు. దాదాపు ఏడు నెలల తర్వాత ఈ సిరీస్‌తోనే ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చాడు. తొలి మ్యాచ్‌లో విఫలమైనా, తర్వాత రెండు వన్డేల్లోనూ హిట్‌మ్యాన్ తనదైన ఆటలో అలరించాడు. అడిలైడ్‌లో 73 పరుగులతో ఆకట్టుకున్న రోహిత్, సిడ్నీ వన్డేలో (121పరుగులు ) సెంచరీతో అదరగొట్టాడు. మొత్తం సిరీస్‌లో 202 పరుగులు బాదాడు.ఇటీవల ముగిసిన సౌతాఫ్రికా సిరీస్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. మూడు మ్యాచ్‌ల్లోనూ రాణించాడు. ఇందులో 2 సెంచరీలు, 1 హాఫ్ సెంచరీ ఉండడం విశేషం. 151 యావరేజ్‌తో విరాట్ 302 పరుగులు చేశాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ దక్కింది. వన్డే కెరీర్‌లో విరాట్‌కు ఇది 12వ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్. ఈ క్రమంలో శ్రీలంక మాజీ క్రికెటర్ సనత్ జయసూర్య (11)ను అధిగమించాడు. ఈ లిస్ట్‌లో సచిన్ తెందూల్కర్ (15) తర్వాతి స్థానంలో కొనసాగుతున్నాడు.ఇక బౌలింగ్ విభాగంలో స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మూడు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. 655 రేటింగ్ పాయింట్లతో కుల్దీప్ వన్డే బౌలింగ్ ర్యాకింగ్స్‌లో ప్రస్తుతం మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. 710 రేటింగ్స్‌తో అఫ్గానిస్థాన్ బౌలర్ రషీద్ ఖాన్ టాప్‌లో ఉండగా, ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ (670 రేటింగ్స్) రెండో ప్లేస్?లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో అఫ్గాన్ క్రికెటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ (334 రేటింగ్స్) టాప్‌లో ఉన్నాడు.



# మహికా శర్మ వల్లే నేను రాణించాను

## టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా

తన ప్రియురాలు మహికా శర్మ వల్లే సౌతాఫ్రికాతో తొలి టీ20లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చానని టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తెలిపాడు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మంగళవారం కటక్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 101 పరుగుల భారీ తేడాతో సౌతాఫ్రికాను చిత్తు చేసింది.176 పరుగుల లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా 74 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా(28 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 59 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు. బౌలింగ్‌లోనూ ఒక వికెట్ తీసి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన వేళ అద్భుత బ్యాటింగ్‌తో జట్టుకు భారీ స్కోర్ అందించాడు. ఈ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్నాడు.ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న హార్దిక్ పాండ్యా.. సానుకూల దృక్పథమే తనను తిరిగి మైదానంలో అడుగు పెట్టేలా చేసిందని తెలిపాడు. 'గాయం తర్వాత నేను మరింత దృఢంగా తిరిగి వచ్చాను. గాయాలు మనల్ని మానసికంగా పరీక్షిస్తాయి. బలంగా నిలబడటం వల్లే నాలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది. నా మీద నాకు చాలా నమ్మకం ఉంది. నిజానికి మనల్ని మనం కచ్చితంగా నమ్మాలి. మనమీద మనకే విశ్వాసం లేనప్పుడు ఇతరులు మనల్ని ఎలా నమ్ముతారు. మైదానంలో దిగిన ప్రతీ క్షణాన్ని, ఆటను ఆస్వాదించాలనుకున్నా. జనాలను ఆకట్టుకునేలా ఆడాలనుకోవడమే నాకు అసలైన ప్రేరణ. అలాగే నేను రాణించడానికి నా ప్రియురాలు కూడా ఓ కారణం. ఆమె నా జీవితంలోకి వచ్చిన తర్వాత చాలా మంచి జరిగింది.'అని హార్దిక్ పాండ్యా తన ప్రియురాలు మహికా శర్మ గురించి చెప్పుకొచ్చాడు.ముంబైలో కొందరు ఫొటోగ్రాఫర్లు మహికా శర్మను అసభ్యంగా ఫొటోలు తీయడంపై హార్దిక్ పాండ్యా ఆగ్రహం వ్యక్తం చేశాడు. మహిళలకు కనీస గౌరవం ఇవ్వాలని , ప్రతీ ఒక్కరికీ హద్దులుంటాయని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నాడు. మహికా శర్మ లోదుస్తులు కనిపించేలా ఫొటోలు, వీడియోలు తీయగా.. అవి నెట్టింట వైరల్‌గా మారాయి.



# గౌతమ్ గంభీర్‌పై షాహిద్ అఫ్రిది ఫైర్!

భారత క్రికెట్ జట్టులో వెటరన్ ఆటగాళ్ల కొనసాగింపుపై చర్చ జరుగుతున్న సమయంలో పాక్ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సిరీస్‌లలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల అద్భుత ప్రదర్శన తర్వాత షాహిద్ అఫ్రిది వారిని 2027 ప్రపంచ కప్ వరకు జట్టులో కొనసాగించాలని గట్టిగా వాదించారు. ఈ నేపథ్యంలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. భారత వన్డే ప్రణాళికలకు ఈ ఇద్దరూ చాలా కీలకమని అభిప్రాయపడ్డారు.టీమిండియా ఈ ఇద్దరు దిగ్గజాలను తెలివిగా ఉపయోగించుకోవాలని అఫ్రిది సూచించారు. బలహీన జట్లతో ఆడేటప్పుడు వారికి విశ్రాంతి ఇచ్చి కీలక సిరీస్‌లలో వారిని ఆడించాలని చెప్పారు. "విరాట్, రోహిత్ భారత బ్యాటింగ్ లైనప్‌కు వెన్నెముక అనే వాస్తవాన్ని అంగీకరించాలి. ఇటీవల వన్డే సిరీస్‌లలో వారు ఆడిన తీరు చూస్తే, వారు 2027 ప్రపంచ కప్ వరకు సులభంగా ఆడగలరని నమ్మకంగా చెప్పవచ్చు. మీరు ఈ ఇద్దరు స్టార్స్‌ను రక్షించుకోవాలి. భారతదేశం ఒక బలహీనమైన జట్టుతో ఆడుతున్నప్పుడు, కొత్త ఆటగాళ్లను ప్రయత్నించి, విరాట్, రోహిత్‌లకు విశ్రాంతి ఇవ్వవచ్చు." అని అఫ్రిది వ్యాఖ్యానించారు.గత కొన్నేళ్లుగా అఫ్రిది, గౌతమ్ గంభీర్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ ఆల్‌రౌండర్ భారత హెడ్ కోచ్‌ను విమర్శించడానికి వెనుకాడలేదు. గంభీర్ సారథ్యంలో టీమిండియా మిశ్రమ ఫలితాలను చవిచూసింది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌ను గెలిచినప్పటికీ, టెస్టుల్లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మరియు దక్షిణాఫ్రికా చేతుల్లో ఓటమిని ఎదుర్కొంది. "గౌతమ్ తన పదవీకాలాన్ని ప్రారంభించిన తీరు చూస్తే, తాను అనుకున్నది, తాను చెప్పింది మాత్రమే సరైనదని అతను భావించినట్లు అనిపించింది. కానీ కొంతకాలం తర్వాత, మీరు ఎల్లప్పుడూ సరైనవారు కారని నిరూపించబడింది." అని అఫ్రిది విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా అఫ్రిది వన్డేల్లో అత్యధిక సిక్సర్ల రికార్డును బద్దలు కొట్టినందుకు రోహిత్ శర్మను అభినందించారు. ఐపీఎల్ 2009లో డెక్కన్ ఛార్జర్స్ తరఫున రోహిత్‌తో కలిసి ఆడిన అఫ్రిది, అప్పుడే రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌లో పెద్ద స్టార్ అవుతాడని తనకు తెలుసునని చెప్పారు. "రికార్డులు బద్దలు కొట్టడానికే ఉంటాయి, ఈ రికార్డు కూడా ఇప్పుడు మెరుగుపడింది. నేను ఎప్పుడూ ఇష్టపడే ఆటగాడు ఈ రికార్డును బద్దలు కొట్టినందుకు నేను సంతోషిస్తున్నాను." అని షాహిద్ అఫ్రిది పేర్కొన్నారు.

# ఆర్‌సీబీ షార్ట్‌లిస్ట్ సిద్ధం



డిఫెండింగ్ ఛాంపియన్‌లైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, జోష్ హాజిల్‌వుడ్, కెప్టెన్ రజత్ పాటిదార్ వంటి స్టార్లతో కూడిన 17 మంది ఆటగాళ్ల స్థిరమైన కోర్‌తో ఇండియన్ ప్రీమియర్ లీగ్ మినీ-వేలంలోకి ప్రవేశిస్తోంది. ఛాంపియన్‌షిప్ హోదాను కాపాడుకోవడానికి చిన్నపాటి, నిర్దిష్టమైన ఖాళీలను భర్తీ చేయడమే వ్యూహంగా వేలంలోకి దిగనుంది. విదేశీ ఆల్ రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, పేసర్ లుంగి ఎన్‌గిడిల విడుదలతో ఏర్పడిన ఎనిమిది ఖాళీలను (రెండు విదేశీ స్థానాలతో సహా) భర్తీ చేయడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ. 16.40 కోట్లను ఖర్చు చేయనుంది. జోష్ హాజిల్‌వుడ్, నువాన్ తుషారాలతో పేస్ ఎటాక్‌లో డెప్త్ ఉన్నప్పటికీ, హాజిల్‌వుడ్ పనిభారం నిర్వహణ, తుషారాకు తగినంత అనుభవం లేకపోవడం వల్ల, వారితో భాగస్వామిగా ఉండటానికి లేదా రొటేట్ చేయడానికి అధిక ప్రభావం చూపే, ప్రపంచ స్థాయి పేస్ బౌలర్ అవసరం. ఇది అత్యంత కీలకమైన విదేశీ ప్లేయర్ అవసరాన్ని సూచిస్తుంది. ఢిల్లీ క్యాపిటల్స్ విడుదల చేసిన అన్రిచ్ నోర్జే ఇందుకు సరిగ్గా సరిపోతాడు. అతను పవర్ ప్లే, మిడిల్ ఓవర్లలో 145ం కిమీ/గం వేగంతోపాటు దూకుడును అందిస్తాడు. ఇది బెంగళూరులోని ఫ్లాట్ పిచ్‌లపై విలువైన ఆస్తిగా మారనుంది. దక్షిణాఫ్రికాకు చెందిన మరో ఆప్షన్ గెరాల్డ్ కోయెట్జీ (గుజరాత్ విడుదల చేసింది). అతను హాజిల్‌వుడ్‌కు దీర్ఘకాలిక బ్యాకప్‌గా పనిచేయడానికి విలువైన ఎంపిక. డెత్ ఓవర్లలో స్పెషలిస్ట్‌గా నిరూపించుకున్న ముస్తాఫిజుర్ రెహమాన్ ను తిరిగి తీసుకురావాలని కూడా భావించవచ్చు. టాప్-ఆర్డర్ పటిష్టంగా ఉంది. కానీ ఫ్రాంచైజీకి స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని, మిడిల్ ఆర్డర్‌లో గేమ్‌లను ముగించగల నాణ్యమైన భారతీయ బ్యాటర్ అవసరం. పరిమిత విదేశీ స్లాట్‌లతో సౌలభ్యాన్ని అనుమతించడానికి ఇది కీలక దృష్టిగా మిగిలిపోయింది. వెంకటేష్ అయ్యర్ వారి ప్రధాన లక్ష్యం. అతను ఎడమచేతి వాటం పవర్, 3 లేదా 4వ స్థానంలో బ్యాటింగ్ చేసే సామర్థ్యం, ఉపయోగకరమైన పేస్ బౌలింగ్‌ను అందిస్తాడు. మరింత వాస్తవిక, బడ్జెట్‌కు అనుకూలమైన లక్ష్యం మహిపాల్ లోమ్రోర్. అతను మిడిల్ ఆర్డర్‌తోపాటు లెగ్-స్పిన్‌ను సంధించగల ఎడమచేతి వాటం భారతీయ ఆల్ రౌండర్. ఫ్రాంచైజీ పృథ్వీ షా వైపు కూడా చూడవచ్చు. కృనాల్ పాండ్యా, సుయాష్ శర్మల స్పిన్ ద్వయాన్ని అట్టిపెట్టుకున్నప్పటికీ, 2025లో నిజమైన, అధిక ప్రభావం చూపే వికెట్లు తీసే స్పిన్నర్ లేరు. దీనిని పరిష్కరించడానికి, వారు ఎలైట్ (అత్యుత్తమ) ఆప్షన్ కోసం ప్రయత్నిస్తారని భావిస్తున్నారు. రవి బిష్ణోయ్కి డిల్ ఓవర్లలో వికెట్లు తీసే ముప్పును ఎక్కువగా కలిగి ఉంటాడు. ఇది జట్టుకు భారీ అప్‌గ్రేడ్ అవుతుంది. వనిందు హసరంగా తో పునఃకలయిక కూడా సాధ్యమే. లియామ్ లివింగ్‌స్టోన్ విడుదలతో ఒక బహుముఖ విదేశీ బ్యాటింగ్ ఆల్ రౌండర్ కోసం చిన్న ఖాళీని మిగిల్చింది. మైఖేల్ బ్రేస్‌వెల్ ఈ అవసరానికి సరిగ్గా సరిపోతాడు. అతను మిడిల్ ఆర్డర్‌లో ఎడమచేతి వాటం బ్యాటింగ్, పొదుపుగా ఉండే ఆఫ్-స్పిన్‌ను అందిస్తాడు. దీని వలన అతను కృనాల్ పాండ్యాకు అనుబంధంగా ఉండటానికి అనువైన రొటేషనల్ ప్లేయర్‌గా మారుతాడు.

# వారణాసిలో యుగయుగాల చరిత్ర

## ఐదు అవతారాల్లో మహేశ్

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కలయికలో రూపొందుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' మీద ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇండియన్ సినిమా చరిత్రలోనే రికార్డు స్థాయి బ్జడెట్‌తో నిర్మాణం జరుపుకుంటున్న ఈ ప్రాజెక్ట్‌ను గ్లోబల్ ఆడియెన్స్‌కు చేరవేయాలనే లక్ష్యంతో రాజమౌళి ప్రతి ప్రమోషన్‌ను అత్యున్నత స్థాయిలో ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇక ఇదిలా ఉంటే వారణాసికి సంబంధించిన మరో వార్త కూడా నెట్టింట వైరల్‌గా మారింది.చిత్రంలో మహేష్ ఏకంగా ఐదు అవతారాల్లో కనిపించబోతున్నాడని అంటున్నారు. సినిమాలో చాలా యుగాలు చూపించబోతున్న నేపథ్యంలో యుగానికి ఓ అవతారంలో మహేష్ కనిపిస్తాడా అని ముచ్చటించుకుంటున్నారు. గెటప్స్ ఏంటో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే . రాజమౌళి అయితే వీటిని ఇప్పట్లో రివీల్ చేసే అవకాశం అసలు లేదు. వారణాసిలో మహేష్ రెండు లుక్స్ లో కనిపించబోతున్నారనే క్లారిటీ ఇప్పటికే ఉంది. రుద్ర అనే పాత్రతో పాటు రాముడిగా కనిపించి మహేష్ అలరించనున్నాడు.ఇదే క్రమంలో తాజాగా సోషల్ మీడియాలో వెలుగుచూసిన కొన్ని ఫోటోలు భారీ హంగామా సృష్టించాయి. లాస్ వెగాస్‌లోని ప్రపంచ ప్రసిద్ధ స్పియర్ బాల్‌పై 'వారణాసి' గ్లింప్స్ ప్రదర్శించారన్న న్యూస్ విపరీతంగా వైరల్ అయింది. స్పియర్ బాల్‌పై మహేష్ బాబు విజువల్స్ తిరుగుతున్నట్లు కనిపించే ఆ ఫోటోలు నెట్టింట్లో వేగంగా స్ప్రెడ్ కావడంతో అందరు నిజమేనని నమ్మారు. కాని వాస్తవానికి అవి అసలు నిజం కావని తర్వాత తేలింది. ఆ ఫుటేజ్, ఫోటోలు అన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవి మాత్రమే అని పరిశీలనలో బయటపడింది. దీంతో చాలామంది అభిమానులు, నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే స్పియర్ బాల్‌పై ప్రమోషన్ చేయడం అసాధ్యమేమి కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్రాండ్లు, సినిమాలు అక్కడ తమ కంటెంట్‌ను ప్రదర్శిస్తున్న దృష్ట్యా, సరైన మొత్తాన్ని చెల్లిస్తే 'వారణాసి' టీమ్ కూడా భవిష్యత్తులో అలాంటి గ్లోబల్ ప్రమోషన్ చేయవచ్చని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.



# అఖండ-2 విడుదలతో పలు సినిమాలు వాయిదా




టాలీవుడ్ మాస్ యాక్షన్ జానర్‌లో భారీ అంచనాలు సెట్ చేసిన నందమూరి బాలకృష్ణ తాజా చిత్రం 'అఖండ 2: తాండవం' 12 నుంచే ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా మాస్ ఎంటర్‌టైనర్ వాయిదా పడిన తర్వాత మరింత హైప్‌ను సొంతం చేసుకుంది. చివరకు డిసెంబర్ 11 రాత్రి ప్రీమియర్ షోలు, 12 నుంచి ఫుల్ ఫ్లెడ్జ్ రిలీజ్ అని అధికారికంగా ప్రకటించడంతో, ఇప్పటికే ఆ తేదీకి షెడ్యూల్ చేసుకున్న పలు చిత్రాల విడుదల తేదీలలో మార్పులు చేసుకోక తప్పలేదు. అఖండ 2 రిలీజ్ డేట్‌ను ప్రకటించే వరకు ఇతర సినిమాలన్నీ సస్పెన్స్‌లో పడిపోయాయి. అఖండ 2..డిసెంబర్ 12కా లేదంటే , క్రిస్మస్ సీజన్‌లో విడుదలవుతుందో తెలియక ఆ సమయంలో రిలీజ్‌కి సిద్ధమైన పలు సినిమాలు తమ విడుదల తేదీలను మార్చుకోవాలా లేదా అనే సందిగ్ధతలో ఉన్నాయి. ఆ సమయంలో, బాలయ్య సినిమాపై క్లారిటీ వచ్చిన వెంటనే కొన్ని నిర్మాణ సంస్థలు తమ ప్లాన్‌లను మార్చేశాయి. డిసెంబర్ 12న రావాల్సిన రోషన్ కనకాల-సందీప్ రాజ్ కాంబినేషన్ చిత్రం 'మోగ్లీ' ఒక రోజు వెనక్కి తగ్గి డిసెంబర్ 13కి మారింది. నందు నటించిన 'సైక్ సిద్దార్థ్' అయితే ఏకంగా నూతన సంవత్సర కానుకగా జనవరి 1 న రిలీజ్‌కి సిద్ధమైంది.ఇక ఈ జాబితాలో సూపర్ స్టార్ రజినీకాంత్ చిత్రం కూడా చేరింది. రజినీకాంత్ పుట్టినరోజు సందర్భంగా తెలుగు స్టేట్స్‌లో శంకర్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ చిత్రం 'శివాజీ' ని రీరిలీజ్ చేయాలని అనుకున్నారు. కాని అఖండ 2 ప్రభావంతో ఆ చిత్రం కూడా వాయిదా పడింది. ఈ పరిణామాలు చూస్తుంటే మార్కెట్‌లో అఖండ 2 హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. బాలయ్య-బోయపాటి కాంబో ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన నేపథ్యంతో ఈ సినిమా పై అపారమైన అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే వారం ఆలస్యంగా వస్తున్న అఖండ 2 ఈ భారీ హైప్‌ను నిలబెట్టుకుంటుందా? బాక్సాఫీస్ వద్ద అదే స్థాయి తాండవం చేస్తుందా? అన్నది మరో 24గంటల్లోనే తేలనుంది.




# త్రివిక్రమ్-వెంటకటేశ్ కాంబో

## ఆదర్శ కుటుంబం టైటిల్ ఖరారు

త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా రూపొందుతున్న మూవీని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు 'ఆదర్శ కుటుంబం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'హౌస్ నం47 ' అనేది ఉప శీర్షిక. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన తర్వాత దీనికి సంబంధించిన ఎన్నో పేర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. వాటికి చెక్ పెడుతూ ఈ టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. అలాగే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ బుధవారం నుంచి ప్రారంభమైనట్లు తెలుపుతూ వెంకటేశ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను కూడా పంచుకున్నారు. వచ్చే ఏడాది వేసవిలో దీన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. తాజాగా పంచుకున్న ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో వెంకటేశ్ సింపుల్‌లుక్‌లో మధ్యతరగతి వ్యక్తిగా ఆకట్టుకుంటున్నారు. సంచలన విజయం సాధించిన 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత వెంకటేశ్ సోలోగా నటిస్తున్న సినిమా ఇదే. వెంకటేశ్ కథానాయకుడిగా ఇదివరకు వచ్చిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్ట్‌ని అందించారు. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. త్రివిక్రమ్ గత చిత్రాల్లాగే ఇందులోనూ ఇద్దరు నాయికలకు అవకాశమున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆ పాత్రల కోసం త్రిష, నిధి అగర్వాల్‌తో పాటు రుక్మిణీ వసంత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం బలంగా వినిపిస్తోంది. దీనితో పాటు వెంకటేశ్ వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమయ్యారు. చిరంజీవి-అనిల్ రావిపూడి కాంబోలో రానున్న 'మన శంకర వరప్రసాద్'లో అతిథి పాత్రలో కనిపించనున్నారు. అలాగే 'దృశ్యం -3'తో మరోసారి థ్రిల్ పంచనున్నారు.

# సినిమా నిర్మాణం ఎవరి ఇష్టం వారిదే

## అన్నగారు ప్రచార కార్యక్రమంలో కార్తీ



సినిమాను తెరకెక్కించడంలో ఎలాంటి రూల్స్ లేవని నటుడు కార్తి అభిప్రాయపడ్డారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'అన్నగారు వస్తారు' నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించగా, డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా కార్తి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.సినిమాను ఇలానే తీయాలి అని రూల్స్ ఉండవు. మనకు నచ్చినట్లు ప్రేక్షకులకు నచ్చేవిధంగా తెరకెక్కించవచ్చు. ఈ విషయంలో ఎవరి వ్యక్తిగత నిర్ణయం వారిది. ఎవరికి నచ్చినట్లు వాళ్లు రూపొందిస్తారు. ఈ విషయంలో ఎవరూ ఎవరికీ నేర్పించలేరు. మనం చిన్నప్పటి నుంచి చూసిన సినిమాల ప్రభావం మనపై ఎక్కువగా ఉంటుంది. మంచి చిత్రాలు రూపొందిస్తే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరణ చూపిస్తారు. 'అన్నగారు వస్తారు'లో మంచి ఫైటింగ్ సీన్స్ ఉన్నాయి. అవి సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని చెప్పారు. ఇక తాను ఇండస్ట్రీకి రావడానికి ముందు అమెరికాలో వర్క్ చేసినట్లు కార్తి తెలిపారు. 'నేను అమెరికాలో మూడు సంవత్సరాలు చదువుకున్నాను. అక్కడ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసి ఇక్కడకు వచ్చాను. నేను చదువు మానేసి సినిమాల్లోకి వెళ్తాను అని చెప్పగానే అక్కడి వాళ్లందరూ షాక్ అయ్యారు. నువ్వు ఇంత మంచి స్టూడెంట్‌వి సినిమాల్లోకి ఎందుకు వెళ్లడం అన్నారు. ఆ రంగానికి వెళ్లకు కెరీర్ మొత్తం పాడైపోతుంది అన్నారు. నేను ఇండస్ట్రీకి రావడానికి మా కుటుంబం చాలా సపోర్ట్ చేసింది' అని వెల్లడించారు.



# 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' రెండో సీజన్ రెడీ

భారత స్వాతంత్ర్య పోరాటం, దేశ విభజన నాటి చారిత్రక ఘట్టాలను కళ్లకు కట్టినట్లు చూపించిన ప్రముఖ వెబ్ సిరీస్ 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' తన రెండో సీజన్‌తో రాబోతుంది. నిఖిల్ అద్వానీ దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్ ప్రముఖ రచయితలు డొమినిక్ లాపియర్, లారీ కాలిన్స్ రాసిన ప్రసిద్ధ పుస్తకం 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' ఆధారంగా రాబోతుంది. తాజాగా ఈ దీనికి సంబంధించిన ట్రైలర్‌తో పాటు స్ట్రీమింగ్ తేదీని చిత్రబృందం విడుదల చేసింది. రెండో సీజన్‌ని జనవరి 9 నుంచి ప్రముఖ ఓటీటీ సోనిలివ్ వేదికగా స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. రెండో సీజన్ ట్రైలర్ చూస్తుంటే.. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే దేశంలో చోటు చేసుకున్న కీలక పరిణామాలను ఈ సిరీస్ ప్రస్తావించనుంది. స్వాతంత్ర్యానంతరం భారత్ ఎదుర్కొన్న పెను సవాళ్లు, దేశాన్ని ఒకే తాటిపైకి తీసుకురావడానికి జరిగిన భారీ పోరాటంపై దృష్టి సారించింది. ముఖ్యంగా, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి మహానాయకులు అప్పటికింకా భారతదేశంలో భాగంగా లేని రాచరిక సంస్థానాలను ఏ విధంగా విలీనం చేశారు. అలాగే కీలకమైన కలకత్తాను పాకిస్థాన్‌లో కలపకుండా ఎలా అడ్డుకున్నారు. చారిత్రక నగరం అయిన లాహోర్‌ని ఎలా వదులుకున్నారు అనేది ఇందులో ఆసక్తికరంగా సాగింది. మొదటి సీజన్ భారీ విజయం అందుకున్న నేపథ్యంలో దేశ నిర్మాణంలో మన నాయకులు పడిన శ్రమను తెలుసుకోవాలనుకునే చరిత్ర అభిమానుల్లో సీజన్ 2 పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**